


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 450 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 19 జూన్ 2025 | వెల : 4/-


# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల మోత




- ఖర్చు ఎంతైనా పర్లేదు? తమ బిడ్డల భవిష్యత్ బాగుండాలని ఆరాటపడుతున్నారు.
- కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు.
- ఇక ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంగతి చూస్తే నిర్ణయించిన ఫీజు కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ తీసుకునే పరిస్థితి ఉండదు
- తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారు
- ప్రతి ఏడాది కూడా ఫీజులు పెంచుతూ రకరకాల కారణాలు చెబుతున్నారు.

హైదరాబాద్

ఇంగ్లీషు మీడియంపై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. ఖర్చు ఎంతైనా పర్లేదు? తమ బిడ్డల భవిష్యత్ బాగుండాలని ఆరాటపడుతున్నారు. ఎన్ని కష్టాలు భరించైనా సరే యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులను చెల్లిస్తున్నారు. ఇక ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంగతి చూస్తే నిర్ణయించిన ఫీజు కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ తీసుకునే పరిస్థితి ఉండదు. తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రతి ఏడాది కూడా ఫీజులు పెంచుతూ రకరకాల కారణాలు చెబుతున్నారు. ఫీజులు మాత్రమే కాకుండా పుస్తకాలతో పాటు స్టేషనరీ అంటూ మరో రూపంలో కూడా దండుకునే పనిలో ఉంటున్నారు. మరోవైపు ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు, నిబంధనలు తీసుకొచ్చినప్పటికీ వీరి దూకుడుకు కల్లెం వేయలేని

- మిగతా3లో



## అర్హు లందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుంది
- రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని హామీ

## ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం

- గోదావరి - బనకచర్లకు ఆనాడే అంకురార్పణ జరిగింది
- 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించుకున్నారు..
- రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు రాశారు
- రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదు




హైదరాబాద్

2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించుకున్నారు.. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారు అని సీఎం తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు. "21-9-2016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తోందని అపెక్స్

- మిగతా3లో



### ఆర్థిక వ్యవస్థకు విఘాతం

- దొంగనోట్ల నిందితుడికి బెయిల్ నిరాకరణ
- నకిలీ కరెన్సీ నోట్ల ముద్రణ ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగిస్తుంది
- రూ.8 లక్షల నకిలీ డబ్బుతో నిందితుడిని పోలీసుల అదుపులోకి




### ఇకపై హిందీ తప్పనిసరి కాదు

- ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు హిందీని మూడవ భాషగా తప్పనిసరిగా బోధించడాన్ని రద్దు
- ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ నూతన నోటిఫికేషన్ జారీ
- మహారాష్ట్ర పాఠశాలల్లో త్రిభాషా సూత్రం అమలు

## 'రేవంత్‌కు చంద్రబాబుకు ఉన్న లాలూచీ ఏంటో'?



- బనక చర్ల ప్రాజెక్ట్ అపాలంటే ఢిల్లోలో ఉద్యమాలు చేయాలి
- ఇక్కడ ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో ఒరిగేదేమీ లేదు
- డిల్లీకి వెళ్ళే సీఎంలలో రేవంత్ గిన్నిస్ బుక్ రికార్డు.

హైదరాబాద్

రేవంత్‌కు చంద్రబాబుకు ఉన్న లాలూచీ ఏంటో? రేవంత్ నల్లమల టైగర్ కాదు..పేపర్ టైగర్ రేవంత్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. బుధవారం (జూన్18) ఎమ్మెల్సీ కవిత ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలపై మీడియాతో మాట్లాడారు. 'కేంద్ర బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరుతూ తెలంగాణ జాగృతి తరుపున జులై 16,17,18న రైల్వే రోకోలు నిర్వహిస్తాం. రైల్వే వ్యవస్థను స్తంబింపజేస్తాం. బనక చర్ల ప్రాజెక్ట్ అపాలంటే ఢిల్లోలో ఉద్యమాలు చేయాలి. ఇక్కడ ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో ఒరిగేదేమీ లేదు. డిల్లీకి వెళ్ళే సీఎంలలో రేవంత్

- మిగతా3లో



## మీ ప్రమేయం లేదు.. ఇక మీదట ఉండబోదు కూడా!

- పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు
- భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు
- కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్‌పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి.



### ఇరాన్‌లోని 1100 లక్ష్యాలను ధ్వంసం చేశాం

- ఇజ్రాయెల్ బలగాల ప్రకటన
- అణు ముప్పును తాము ఒక వ్యూహం ప్రకారం అణచివేస్తున్నాం
- 'మేం ఒక పద్ధతి ప్రకారం ఇరాన్‌లోని అణుముప్పును నాశనం చేస్తున్నాం
- మా దాడులు వారి నష్టాన్ని గణనీయంగా పెంచుతున్నాయి

# మీ ప్రమేయం లేదు..
# ఇక మీదట ఉండబోదు కూడా!



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ షాకిచ్చారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ యుద్ధాన్ని తానే అడ్డుకున్నానని ట్రంప్ ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఇరు దేశాల ఉద్రిక్తతలు చల్లారడంలో ఎవరి ప్రమేయం లేదని.. ఇక మీదట కూడా ఉండబోదని ట్రంప్‌నకు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. జీ-7 సదస్సు వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ప్రధాని మోదీ భేటీ జరగాల్సి ఉంది. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో తన పర్యటనను కుదించుకుని ట్రంప్ వెళ్లిపోయారు. ఈ తరుణంలో ఇరు దేశాల అధినేతలు ఫోన్ ద్వారా అరగంట మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి.. దానికి ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వివరాలను మోదీ ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంలోనే..
మోదీ ట్రంప్‌తో మాట్లాడుతూ.. పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్‌పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉందని అన్నారాయన. దీనికి ట్రంప్ ఉగ్రవాదంపై భారత్ జరిపే పోరునకు అమెరికా మద్ధతు ఉంటుందని తెలిపారు. ట్రంప్-మోదీ మధ్య ఫోన్ కాల్ సంభాషణ సారాంశాన్ని కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వివరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఫోన్ కాల్ ద్వారా ట్రంప్ మోదీకి సంతాపం తెలియజేశారని, ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడుకోవడం ఇదేనని మిస్రీ తెలిపారు. అయితే కెనడా పర్యటన ముగిచుకుని వెళ్లే క్రమంలో అమెరికాకు రావాలంటూ ట్రంప్ మోదీని ఆహ్వానించగా.. షెడ్యూల్ ప్రకారం తాను రాలేనని మోదీ తెలిపినట్లు సమాచారం. భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్‌లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు ఇదిలా ఉంటే.. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లు ట్రంప్ ప్రకటించుకోవడం భారత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ ప్రకటనపై స్పష్ట త ఇవ్వాలని ప్రతిపక్షాలు సైతం డిమాండ్ చేశాయి కూడా.

# ప్రమాదానికి మూడు నెలల క్రితమే కొత్త ఇంజిన్..
# రూ.4 వేల కోట్లకుపైగా బీమా..!



అహ్మదాబాద్‌లో గతవారం జరిగిన ఘోర విమాన ప్రమాద దర్యాప్తులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఏఐ 171 కుడివైపున ఉన్న ఇంజిన్‌ను మూడు నెలల క్రితమే ఓవర్ హాలింగ్ సమయంలో అమర్చినట్లు అధికారులు గుర్తించారు. . సుమారు 12 సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న ఈ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి చివరిసారిగా జూన్ 2023లో నిర్వహణ పనులు చేపట్టారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2025లో నిర్వహించాల్సి ఉంది. ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన బీమా వివరాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ప్రమాదం కారణంగా దేశ చరిత్రలోనే అతిపెద్ద విమాన బీమా క్లెయిమ్ నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. ప్రమాదానికి గురైన ఈ బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానానికి సంబంధించి ఎయిర్ ఇండియా సంస్థ బీమా కవరేజీని ఇంజిన్ మార్పిడికి ముందే రూ.750 కోట్ల నుంచి రూ.850 కోట్లకు పెంచింది. ఈ ప్రమాదానికి సంబంధించి ప్రభుత్వ రంగ నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ దిగ్గజం జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ) మొత్తం క్లెయిమ్‌లు సుమారు 475 మిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. భారత కరెన్సీ ప్రకారం రూ.4,000 కోట్లకుపైమాటే. ఈ మొత్తంలో విమానం నష్టానికి గానూ 125 మిలియన్ డాలర్లు కాగా, ప్రయాణికుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, థర్డ్ పార్టీ నష్టాలు, ఇతర వ్యక్తులకు జరిగిన నష్టాలు, ట్రావెల్ పాలసీల కింద మరో 350 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

## ఇరాన్‌లోని 1100 లక్ష్యాలను ధ్వంసం చేశాం..



ఇరాన్ దేశం నుంచి అణు ముప్పును తాము ఒక వ్యూహం ప్రకారం అణచివేస్తున్నామని ఇజ్రాయెల్ సాయుధ దళాలు తెలిపాయి. ఇప్పటికే తమ ఎయిర్‌ఫోర్స్ ఇరాన్‌లోని 1,100 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ వెల్లడించారు. 'మేం ఒక పద్ధతి ప్రకారం ఇరాన్‌లోని అణుముప్పును నాశనం చేస్తున్నాం. మా దాడులు వారి నష్టాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ఫలితంగా వారి బాలిస్టిక్ క్షిపణులు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి' అని డెఫ్రిన్ పేర్కొన్నారు. దాడులకు సంబంధించిన వీడియోలను కూడా ఇజ్రాయెల్ దళాలు షేర్ చేశాయి. కాగా ఇజ్రాయెల్ వాయుసేనకు చెందిన విమానాలు గత శుక్రవారం నుంచి ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయి. పశ్చిమ ఇరాన్, టెహ్రాన్ గగనతలంపై తాము పూర్తిగా పట్టు సాధించినట్లు చెబుతున్నాయి. ఇప్పటివరకు 70 ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. ఇదిలావుంటే ఇజ్రాయెల్‌కు చెందిన ఓ భారీ డ్రోన్‌ను కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ కూడా ధ్రువీకరించింది. తమ మానవరహిత విమానాన్ని ఇరాన్ ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణిని వాడి ధ్వంసం చేసిందని పేర్కొంది.

# లొంగిపోయే ప్రసక్తే లేదు
## - ఇరాన్ సుప్రీం లీడర్



**ఇంటర్నెట్ డెస్క్:** తమపై దాడి చేసి ఇజ్రాయెల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ వీడియో సందేశం విడుదల చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. అంతేకాదు అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు.

**విస్తృత యుద్ధమే..!**

ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న పోరులో అమెరికా జోక్యం చేసుకుంటే అది పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఘర్షణల నేపథ్యంలో తొలిసారి స్పందించిన ఆయన.. తమపై దాడులకు దీటుగా స్పందిస్తామన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగా ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఖమేనీ ఈ విధంగా స్పందించారు.

**యూఎస్ సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం.. అమెరికాకు ఇరాన్ సుప్రీం లీడర్ వార్నింగ్**

ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ బేషరతుగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించిన విషయం తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలపై ఖమేనీ తాజాగా స్పందించారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు అమెరికా సైనిక జోక్యం వల్ల కోలుకోలేని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఈ మేరకు ఖమేనీ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'ఇరాన్ దేశ చరిత్ర తెలిసిన తెలివైన వ్యక్తులు ఈ దేశంతో ఎప్పుడూ బెదిరింపు ధోరణితో మాట్లాడరు. ఎందుకంటే ఇరాన్ దేశం ఎన్నటికీ లొంగిపోదు. అమెరికా సైనిక జోక్యం చేసుకుంటే.. నిస్సందేహంగా కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయాన్ని అమెరికన్లు తెలుసుకోవాలి' అని సుప్రీం లీడర్ హెచ్చరించారు.

**ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తెలుసు..**

ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసునని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెల్లడించారు. అయితే ఖమేనీ చావును ప్రస్తుతానికి తాము కోరుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా బేషరతుగా లొంగిపోవాలని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కేవలం కాల్పుల విరమణను మాత్రమే తాను కోరుకోవడం లేదని, అంతకన్నా మెరుగైన పరిష్కారాన్నే తాను కోరుకుంటున్నానని ట్రంప్ ప్రకటించారు. జీ7 సదస్సును అర్ధాంతరంగా ముగించుకుని సోమవారం రాత్రి కెనడా నుంచి వాషింగ్టన్‌కు తిరిగివస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

## ఆర్థిక వ్యవస్థకు విఘాతం



**ఢిల్లీ:** నకిలీ కరెన్సీ నోట్ల రాకెట్‌లో అరెస్టైన విదేశీయుడికి సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అతడు పాల్పడిన చర్యలను ఆర్థిక వ్యవస్థకు విఘాతంగా పేర్కొంది. ఇలాంటి వ్యక్తికి బెయిల్ మంజూరు చేయడం మంచిది కాదని వ్యాఖ్యానించింది. బల్గేరియాకు చెందిన రుస్లన్ పెట్రోవ్ మెతోదివ్ మనదేశంలో నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించేవాడు. ఈ రాకెట్ వెలుగులోకి రావడంతో 2023లో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.8 లక్షల విలువ గల రూ.500 నకిలీ నోట్లు, వాటిని తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా.. కోర్టు తిరస్కరించింది. దీంతో రుస్లన్ పెట్రోవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా న్యాయస్థానం విచారణ చేపట్టింది.

**కిడ్నాప్ కేసులో ఏడీజీపీ అరెస్టు.. సుప్రీంకోర్టు సీరియస్**

"ఇలాంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. రూ.8 లక్షల నకిలీ డబ్బుతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యక్తిపై నేరారోపణలు చాలా బలంగా ఉన్నాయి. నేరం రుజువై దోషిగా తేలితే దీర్ఘకాలిక శిక్ష విధించే అవకాశం ఉంది. ఇలాంటి నేరానికి పాల్పడిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తే.. అతడు పరారయ్యే అవకాశం లేకపోలేదు. అతడి అభ్యర్థనను మన్నించడం ఆమోదయోగ్యం కాదు" అని సుప్రీం కోర్టు పేర్కొంది.

## 'ఇకపై హిందీ తప్పనిసరి కాదు'




**ముంబై:** మహారాష్ట్ర పాఠశాలల్లో హిందీని తప్పనిసరి బోధన నుంచి ఉపసంహరించారు. మరాఠీ, ఇంగ్లీష్ తర్వాత మూడవ భాషగా హిందీని పరిగణిస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు హిందీని మూడవ భాషగా తప్పనిసరిగా బోధించడాన్ని రద్దు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ నూతన నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక తరగతిలో 20కి మించిన విద్యార్థులు హిందీకి బదులుగా మరొక భాష నేర్చుకోవాలనుకుంటే, సంబంధిత ఉపాధ్యాయుణ్ణి అందుబాటులో ఉంచనున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యా ప్రణాళిక- 2024 ప్రకారం మరాఠీ, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ఒకటి నుండి ఐదు తరగతులకు హిందీ ఇకపై మూడవ భాషగా ఉంటుంది. అయితే ఈ విద్యార్థులు హిందీకి బదులుగా ఇతర భారతీయ భాషలలో ఒకదాన్ని మూడవ భాషగా నేర్చుకోవాలనుకుంటే వారికి అందుకు అనుమతి కల్పిస్తారు. మహారాష్ట్ర పాఠశాలల్లో త్రిభాషా సూత్రం అమలు చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లోనూ మరాఠీ భాషను తప్పనిసరి చేశారు.

## 11 ఏళ్ల నాటి కేసులో..
## ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జైలు శిక్ష

**జైపూర్:** సుమారు 11 ఏళ్ల నాటి కేసులో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా 9 మంది దోషులకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. అయితే వారందరికీ బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పును హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల గడువు ఇచ్చింది. 2014 ఆగస్టు 13న జైపూర్‌లోని రాజస్థాన్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం బయట జేఎల్ఎన్ మార్గాన్ని సుమారు 20 నిమిషాలపాటు నిరసనకారులు దిగ్బంధించారు. ఈ నిరసన సందర్భంగా చట్టవిరుద్ధంగా సమావేశమై ప్రజా రహదారిని అడ్డుకున్నందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. 2016 ఆగస్ట్ 11న ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, ఈ కేసుపై 11 ఏళ్లుగా కోర్టులో విచారణ కొనసాగింది. జైపూర్ జిల్లా కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా తొమ్మిది మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. ఒక్కొక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. వారందరికీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పు, శిక్ష నిలిపివేతపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల సమయం ఇచ్చింది. మరోవైపు జైలు శిక్ష పడిన 9 మందిలో లద్నన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ముఖేష్ భాకర్, షాపురాకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనీష్ యాదవ్, జోత్వారా అసెంబ్లీ స్థానానికి చెందిన మాజీ కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ చౌదరి ఉన్నారు. అయితే దోషిగా నిర్ధారించిన ఇద్దరు కాంగ్రెస్ నేతల అసెంబ్లీ సభ్యత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదు. ప్రస్తుత చట్టం ప్రకారం జైలు శిక్ష రెండేళ్లకు మించితేనే ఎంపీ, ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుంది.

## ట్రంప్- మోదీ సంభాషణ..కాంగ్రెస్ అబద్ధాలు
## బట్టబయలు: భాజపా

**ఢిల్లీ:** భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తొలుత అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనను కాంగ్రెస్ తప్పుబట్టిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు ఎన్నిసార్లు డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంపై తొలిసారి స్పందిస్తూ.. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని ట్రంప్‌నకు తేల్చిచెప్పారు. ప్రధాని ప్రకటనతో ఇన్ని రోజులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అబద్దపు ప్రచారాలు పటాపంచలయ్యాయని భాజపా నేత అమిత్ మాలవీయ పేర్కొన్నారు. ఒప్పందం విషయంలో మూడో వ్యక్తి మధ్యవర్తిత్వం అవసరం లేదని మోదీ చెప్పిన మాటలను కాంగ్రెస్, దాని మద్దతుదారులు జీర్ణించుకోలేకపోతున్నారని అమిత్ మాలవీయ అన్నారు. ఇంతచేసినప్పటికీ కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబడితే..వారు పాక్ జట్టులో భాగమని స్పష్టమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో బలహీనమైన మూడో ప్రపంచ దేశంగా మిగిలిపోయిన భారత్.. ప్రధాని మోదీ పాలనలో వేగంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ కట్టుకథలు చెప్పేటప్పుడు భారత్, ఇక్కడి విదేశాంగ విధానంపై అసత్య ఆరోపణలను ఆపాలని మాలవీయ హితవు పలికారు. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని ప్రధాని మోదీ తేల్చిచెప్పారని కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి స్పష్టంగా చెప్పినట్లు తెలిపారు. ప్రధాని ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ ..విదేశీ పర్యటనలు ముగించుకొని భారత్‌కు వచ్చిన వెంటనే ప్రధాని అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ చేపట్టిన చర్యలు, నేడు ట్రంప్‌తో జరిగిన టెలిఫోన్ చర్చల్లో ఏమి జరిగిందనే విషయాలను ఇక్కడి ప్రతిపక్ష నేతలకు వివరించాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. కాల్పుల విరమణ నిర్ణయం తీసుకోవడానికి భారత్‌కు పాక్ నుంచి ఏమి ప్రయోజనం వచ్చిందని ప్రశ్నించారు. కాల్పుల ఒప్పందంపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల మోత..

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితులు కనిపిస్తున్నాయి.విద్యార్థుల నుంచి వేలకు వేల రూపాయలను ఫీజులుగా తీసుకుంటున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మౌలిక వసతుల కల్పన విషయంలో మాత్రం ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. బిల్డింగ్ నిర్వహణ నుంచి టీచర్ల జీతాల వరకు ఏ విషయం తీసుకున్నా లోపాల పుట్ట బయటపడే పరిస్థితులు ఉన్నాయి.హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని చాలా పట్టణాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలు ఇరుకైన భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. 90 శాతం స్కూళ్ల పరిస్థితి ఇలాగే ఉంది. ఇరుకైన గదుల్లోనే తరగతులు జరుగుతున్నాయి. అందులోనూ సెక్షన్ వారీగా విభజిస్తూ? భవనమంతా పిల్లలతో కిక్కిరిసిపోయి ఉంటున్నాయి. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరం. వాటితోనే మానసికోల్లాసం కలుగుతుందని, దేహధారుడ్యం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నప్పటికీ పెడచెవిన పెట్టేస్తున్నారు. ఎక్కువ సమయం స్కూల్ లోనే గడిపేస్తూ? పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఎంతసేపు చదువే ముఖ్యం అన్నట్లు పాఠశాలలు వ్యవహరిస్తున్న తీరు ఉంటోంది. క్రీడా వసతులు లేక పలు రకాల ఆటలపై మక్కువ ఉండే విద్యార్థులు కూడా వెనకడుగు వేసే పరిస్థితులు ఉంటున్నాయి.ఓవైపు యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు కనీస వసతలు కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఐదో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు కొన్ని రకాల ప్రయోగాత్మక (సైన్స్) పాఠాలు ఉంటాయి. వీటికి థియరీ క్లాసులు మాత్రమే చెబితే సరిపోదు. తప్పనిసరిగా ల్యాబ్ పాఠాలు ఉండాలి.అందులో మెరుగైన బోధన పరికరాలు ఉండేలా చూసుకోవాలి. దీనికంటూ ఓ ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. కానీ చాలా ప్రైవేటు బడుల్లో ఇలాంటి వాటికి చోటు ఉండటం లేదు. ఈ విషయంలో ప్రభుత్వ బడులు ముందంజలో ఉంటున్నాయి.ప్రతి బడిలోనూ గ్రంథాలయం ఉండాలి. చాలా బడుల్లో నామమాత్రంగా సింగిల్ రూమ్ లోనే ఏర్పాటు చేస్తూ? లెక్కలు చూపించుకుంటున్నారు. కొన్నింటిలో వాటి జాడే ఉండటం లేదు. ప్రైవేటు బడుల్లో అతిపెద్ద సమస్య శుభ్రమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవటం! వందలాది మంది విద్యార్థులు ఒకే భవనంలో ఉంటున్నప్పటికీ వారి సంఖ్యకు అనుగుణంగా వీటి నిర్మాణాలు ఉండటం లేదు. ఫ్లోర్ల వారీగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇవి ఏ మాత్రం సరిపోలేని పరిస్థితులు ఉంటున్నాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాలికలు చాలా సమస్యలను ఫేస్ చేస్తున్నారుచాలా ప్రైవేటు పాఠశాలలకు శాశ్వత భవనాలు ఉండటం లేదు. అద్దెకు భవనాలు తీసుకుంటూ నడిపిస్తున్నారు. గాలి, వెలుతురు కూడా సరిగా లేని బడులు చాలాచోట్ల దర్శనమిస్తున్నాయి. కొన్ని బడులకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లు కూడా ఉండటం లేదు.ప్రైవేట్/ కార్పొరేట్ బడుల్లో భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా డొనేషన్ పేరుతో రాబడుతున్నారు. దీనికి సంబంధించి ఏ ఒక్క కాగితం కూడా ఉండదు. కేవలం స్కూల్ ఫీజుకు మాత్రం రశీదులు ఇస్తున్నారు. చట్ట ప్రకారం? డొనేషన్ లు తీసుకోవటం నిషేధం. కానీ దాదాపు అన్ని ప్రైవేటు బడులు? డొనేషన్ల పేరుతో కోట్ల రూపాయలను వెనక్కి వేసుకుంటున్నాయి.ఓవైపు డొనేషన్లు.. మరోవైపు ఫీజులు వసూలు చేసుకుంటూనే అందులో పని చేసే టీచర్లకు మాత్రం అంతంతే అన్నట్లు జీతాలను చెల్లిస్తున్నారు. బీఈడీ, పీజీలు చేసి నైపుణ్యం ఉన్న టీచర్లకు కూడా తక్కువ జీతాలే ఇస్తున్నారు. కొన్ని ప్రీ ప్రైమరీ స్కూళ్లలో 5 నుంచి 15 వేల జీతంతోనే పలువురు టీచర్లు పని చేస్తున్నారు. ప్రైమరీ, హై స్కూల్ కు భోదించే టీచర్లకు రూ. 15 నుంచి రూ. 30 వేల లోపే చెల్లిస్తున్నారు. కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో పని చేసే టీచర్లకు మాత్రం? రూ. 30 వేలకు జీతం ఇస్తున్న పరిస్థితులు ఉన్నాయి.చాలా బడుల యాజమాన్యాలు సకాలంలోనే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ టీచర్లకు మాత్రం సకాలంలో ఇవ్వటం లేదు. నెల పూర్తి అయిన వారం నుంచి పది రోజులలోపు చెల్లిస్తున్నారు. ప్రైవేటు బడుల్లో పని చేసే చాలా మంది టీచర్లకు పీఎఫ్, ఆరోగ్య బీమా వంటి సౌకర్యం కూడా ఉండటం లేదు. కనీసం వీరి సమస్యల గురించి మాట్లాడే పరిస్థితి కనిపించటం లేదు. ఇక వేసవి సెలవులు వస్తే పూర్తిగా జీతాలు ఉండవు. ఈ టైంలో టీచర్ల చెప్పలేనన్నీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.తల్లిదండ్రులను ఆకర్షించేందుకు రకరకాల పేర్లతో పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్ బ్రాంచ్ ఒక చోట ఉంటే?ఆ క్యాంపస్ కు అనుగుణంగా మరికొన్ని బడులు ఉంటున్నాయి. వీటిని ఒలంపియాడ్, టెక్నో, డిజిటల్, ఇంటర్నేషనల్, ఫౌండేషన్ వంటి రకరకాల పేర్లతో నడిపిస్తున్నారు.ఒక్కో క్యాంపస్ లో ఒక్కో విధంగా ఫీజులను వసూలు చేస్తున్నారు. చట్టప్రకారం? ఇలాంటి తోక పేర్లతో పాఠశాలలను నిర్వహించవద్దని ప్రభుత్వం పలుమార్లు ఆదేశాలు కూడా ఇచ్చింది. కానీ తమను ఆపేది ఎవరన్నట్టు? పలు ప్రైవేటు బడుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ముందుకెళ్తున్నాయి. పేరెంట్స్ కమిటీలు పేరుకే అన్న చందంగా మిగిలిపోతున్నాయి.ప్రైవేటు బడుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఆశించిన మేర అమలు కావటం లేదు. ఫీజుల నియంత్రణ నుంచి బడుల్లో మౌలిక వసతులు, టీచర్ల నియాకం వరకు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం దశలోనే తనిఖీలు కాకుండా? నిరంతరం జరిపేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రైవేటు బడులపై నిఘా వ్యవస్థ ఉండాలని? యథేచ్ఛగా ఫీజులు వసూలు చేసే బడులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రైవేటు బడుల్లో మౌలిక వసతుల కల్పనపై హిందుస్థాన్ టైమ్స్ తెలుగుతో ఉస్మానియా వర్సిటీ విద్యార్థి సంఘ నాయకుడు చటారి దశరథ్ మాట్లాడారు. ప్రైవేటు బడులు ఇష్టారాజ్యాంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. డొనేషన్లపై నిషేధం ఉన్నప్పటికీ. భారీ స్థాయిలో తీసుకుంటున్నారని చెప్పారు. ప్రైవేటు బడుల ప్రాంగణంలో బుక్స్, స్టేషనరీ అమ్మవద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ చాలా బడులు ఈ తంతును కొనసాగిస్తున్నాయని తెలిపారు."హైదరాబాద్ నగరంలో ప్రైవేటు బడుల నిర్వహణ దారుణంగా ఉంటోంది. ఇరుకైన భవనాల్లో తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మౌలిక వసతులు కూడా కల్పించటం లేదు. టెట్ అర్హత సాధించిన వారినే టీచర్లుగా రిక్రూట్ చేసుకోవాలి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ప్రైవేటు టీచర్లు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి పే స్కేల్ అమలు చేయాలి. ఆరోగ్య బీమా వంటి సౌకర్యం కల్పించాలి. నిబంధనలు పాటించని స్కూళ్ల అనుమతులను రద్దు చేయాలి. ఫీజుల దోపిడిని నియంత్రించేందుకు సమగ్రమైన చట్టం తీసుకురావాలి" అని దశరథ్ అభిప్రాయపడ్డారు.

## 'రేవంత్‌కు చంద్రబాబుకు ఉన్న లాలూచీ ఏంటో'?

-మొదటిపేజీ తరువాయి

గిన్నిస్ బుక్ రికార్డు. కేటీఆర్ ఏసీబీ విచారణ అంతా టైంపాస్ నిరుపయోగంగా సముద్రంలోకి వెళుతున్న నీటిని రెండు రాష్ట్రాలు వాడుకోవాలి అని కేసీఆర్ చెప్పారు. లీకేజీ పాయింట్ తుపాకుల గూడెం బ్యారేజి వద్ద ఉండాలని కేసీఆర్ తెలిపారు. పోలవరం వద్ద లీకేజీ పాయింట్ పెడితే తెలంగాణకు అన్యాయం జరుగుతుంది. సీఎం రేవంత్ కేంద్ర ప్రభుత్వంతో తుపాకుల గూడెం వద్ద లీకేజీ పాయింట్‌ను చేపట్టాలని ఎందుకు చెప్పడం లేదు? రేవంత్‌కు చంద్రబాబుకు ఉన్న లాలూచీ ఏంటి? రేవంత్ నల్లమల టైగర్ కాదు..పేపర్ టైగర్ రేవంత్. చంద్రబాబు ప్రభుత్వం తెలంగాణపై అక్రమంగా నిర్మిస్తున్న నీటి ప్రాజెక్ట్‌లపై కోర్టుకు వెళ్తాం. బనక చర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం. కేటీఆర్‌పై ఏసీబీది టైం పాస్ విచారణ.ఇలాంటి విచారణలు చాలా చూశాం. హరీష్ రావుకు అస్వస్థత విషయం నాకు తెలియదు. నేను ఏ కార్యక్రమం చేసినా బీఆర్ఎస్ కార్యకర్తలు వస్తున్నారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ' అని కవిత స్పష్టం చేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**హైదరాబాద్ :** భువనగిరి జిల్లా వాసాలమర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. "వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు 2020 నవంబర్ 1న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఆనాడు ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో సహపంక్తి భోజనం చేశారు. బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ వాస్తవంగా ఆరోజు నుంచి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయే 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయన ఫాంహౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి నిలువ నీడ లేకుండా చేశారు. ఆ బాధితులు ఇండ్లు కోల్పోయి తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. బంగారు వాసాలమర్రి దేవుడెరుగు.. ఉన్న ఇండ్లను కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించడం జరిగింది. అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశాం. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం నాడు నేనే స్వయంగా వారికి అందజేస్తున్నాను. దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారు. కొత్త ఇల్లు రాలేదు.. ఉన్న ఇల్లు పోయింది. ప్రజల అవసరాలను ఆశలను వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాలమర్రి గ్రామమే ఒక నిదర్శనం" అని అన్నారు.

## ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం




-మొదటిపేజీ తరువాయి

కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారు. 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆరే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారు. గోదావరి-బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నాం. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. గోదావరి- బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతాం. తెలంగాణకు కృష్ణాలో 299 టీఎంసీలు సరిపోతాయని ఆనాడు కేసీఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆనాడు కేసీఆర్ చేసిన సంతకం ఇవాళ తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### సీఎం వ్యాఖ్యలు ఖండించిన భారాస ఎంపీ

మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందన్నారు.

తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అఖిలపక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో పాటు, భాజపా ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. "గోదావరి-బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి-బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది" అని వివరించారు.

# వానొస్తే... హైడర్ బాద్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం పేరుకు విశ్వనగరం..వానొస్తే నరకం. కొద్దిపాటి వానస్తే చాలు మెయిన్ రోడ్డలలో నీరు నిలిచిపోతుంది. దీనితో వాహనదారులు నానా యాతన పడుతున్నారు. గత ప్రభుత్వాలు ఈ సమస్యపై ఏనాడూ దృష్టి పెట్టకపోవడంతో వానాకాలంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతన్నాయి. ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో ఖరీదైన వస్తువులన్నీ పాడైపోతున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఇకపై ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది. జీహెచ్‌ఎంసీ అధికారులు దీనిపై కార్యాచరణ సిద్ధం చేశారు. నెల రోజుల వ్యవధిలో దీనికి సంబంధించిన పనులను పురపాలక శాఖ ఆధ్వర్యంలో బల్దియా అధికారులు మొదలు పెట్టి పూర్తి చేయబోతున్నారు. వర్షాలతో చెరువులుగా మారే ప్రాంతాల్లో దానికి సమాంతరంగా పెద్ద సంపు తవ్వి అందులోకి మళ్లించే ఏర్పాటు చేయనున్నారు. ఈ సంప్ నుంచి నీటిని మోటార్లు ద్వారా సమీపంలోని అతిపెద్ద నాలాలకు తరలిస్తారు.ఏకధాటిగా 2సెం.మీ.ల వర్షం పడితే చాలు దాదాపు 50చోట్ల చెరువుల్లా మారుతున్నాయి. ఇందులో 20 వరకు ప్రధాన ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. మొదటి దశలో 12 చోట్ల సంపులు నిర్మించాలని నిర్ణయించారు. పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఈ నెలాఖరుకే పనులు పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.హైదరాబాద్ నుంచి శంషాబాద్ వెళ్లే మార్గంలో పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే కింది భాగంలో పిల్లర్ నంబర్ 264 శివరాంపల్లి దగ్గర భారీ వర్షం పడితే ఈ ప్రాంతం చెరువుగా మారుతోంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా దీనికి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో 1.50లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపును నిర్మించనున్నారు. ఈ నీటిని వెంటవెంటనే మోటార్ల ద్వారా బుల్కాపూర్ నాలాలోకి తరలిస్తారు.హుస్సేన్‌సాగర్ చుట్టూ నీరు నిల్చే ప్రాంతాల్లోనూ ఇలాగే సంపుల నుంచి సాగర్‌లోకి పంపించనున్నారు.రాజ్‌భవన్ రోడ్డులోని లేక్ వ్యూ అతిథి గృహం దగ్గర సంపును తవ్వబోతున్నారు. మొదటి దశ పనులు పూర్తయిన తరువాత రెండో దశలో మరికొన్నిచోట్ల నిర్మించాలని నిర్ణయించారు



### సిటీలో 25 వేలకుపైగా మ్యాన్ హోల్స్

హైదరాబాద్ లోని రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. ప్రతీరోజూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదువుతూనే ఉంటాయి. ఇక వర్షం కురిసిందంటే కిలో మీటర్ దూరం వెళ్లాలంటే గంటల సమయం పడుతుంది. దీనికితోడు ఎక్కడ మ్యాన్ హోళ్లు ఉంటాయోనన్న ఆందోళన. పలువురు వాహనదారులు మ్యాన్ హోళ్లలో పడి మరణించిన సందర్భాలు ఉన్నాయి. అయితే, గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న లోతైన మ్యాన్ హోళ్లను ప్రజలు గుర్తించేలా జలమండలి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. అవి అత్యంత ప్రమాదకరమని చెప్పేలా వాటికి ఎరుపు రంగును అద్దుతోంది.గ్రేటర్ పరిధిలో మొత్తం 25వేలకుపైగా లోతైన మ్యాన్ హోళ్లు ఉన్నాయి. వీటిపై సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయడంతోపాటు, వాటిని ప్రజలు తేలికగా గుర్తించేందుకు ఎరుపు రంగు పూస్తున్నారు. తద్వారా వానా కాలంలో, వర్షాలు పడిన సమయంలో మ్యాన్ హోళ్లలో పడకుండా ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇదిలాఉంటే.. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసినప్పుడు రహదారులపైకి భారీగా వర్షపు నీరు చేరుతుంది. ఆ నీరు వెళ్లుందుకు కొందరు మ్యాన్ హోళ్లను తెరుస్తుంటారు. తద్వారా వాహనదారులకు ప్రమాదం పొంచిఉంటుంది. అలాంటి పరిస్థితి లేకుండా జలమండలి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. దీనికితోడు మ్యాన్ హోళ్లను ఎవరైనా తెరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. జలమండలి చట్టం 1989 సెక్షన్ 74 ప్రకారం అక్రమంగా మ్యాన్ హోళు తెరిస్తే క్రిమినల్ కేసులు పెట్టే అధికారం జలమండలికి ఉంది. దీంతో ఎవరైనా తమ ఇష్టానుసారంగా ఎరుపు రంగువేసిన మ్యాన్ హోల్స్ తెరిస్తే ఇక నుంచి జైలు ఊచలు లెక్కించాల్సిందే. నగర వాసులు ఎరువు రంగు వేసిన మ్యాన్ హోల్స్ జోలికి ఎట్టిపరిస్థితుల్లో వెళ్లకండి. మరోవైపు సీవరేజ్ సమస్యలు ఉంటే ప్రజలు లమండలి వినియోగదారుల సేవా కేంద్రం 155313కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# సాగులో టెక్నాలజీ

**అదిలాబాద్ :** ఒకప్పుడు దుక్కి దున్నాలన్నా, విత్తనాలు వేయాలన్నా, ఎరువులు చల్లాలన్నా, కలుపు తొలగించాలన్న ప్రతి పని ని రైతులు కూలీలు చేసుకునేవారు. లేదా ఒకరికొకరు పరస్పరం అవగాహనతో పనులు కానిచ్చేవారు. కానీ ప్రస్తుతం ట్రెండు మారింది. ప్రతి పనిని సమయం, డబ్బు వృథా చేయకుండా రైతులు వినూత్న రీతిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ, యాంత్రికరణతో ముందుకు సాగుతున్నారు. రాను రాను హైటెక్ కాలంలో కూలీల కొరత కారణంగా సకాలంలో ఎరువులు, విత్తనాలు అల కడానికి యంత్రాలను ఉపయోగిస్తూ డబ్బును సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. వానకాలం సాగు మొదలైంది. అడపాదడప వర్షాలు పడుతుండడంతో రైతులు పొలం బాట పడుతున్నారు. దుక్కి దున్నడం మొదలుకొని విత్తనాలు వేయడం, ఎరువులు వేయడం, కలుపులు తీయడం వరకు గతంలో కూలీలతో చేసే పనిని యంత్రాలతో చేస్తున్నారు. కూలి రేట్లు పెరగడంతో రైతులు యంత్రాల పైన దృష్టి సారిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యాంత్రీకరణ క్రమక్రమంగా పెరుగుతోంది. యాంత్రీకరణ లేక ముందు రైతులు ఎవరు ఎద్దులతో వారు అరకతోనే అన్ని రకాల విత్తనాలు వేసేవారు. ఎకరం పొలంలో విత్తనాలు నాటడానికి కనీసం ముగ్గురు నుంచి నలుగురు కూలీలు, అరక అవసరమయ్యేది. అయితే కూలి రేట్లు పెరగడంతో రైతులు యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ఒక్కో కూలీకి రోజుకు విత్తనాలు వేయడానికి రూ. 300 నుంచి రూ. 400, అరక మనిషికి రూ. 1000, ఎద్దులకు రోజుకు 3000 కిరాయి ఉంది. మొక్కజొన్న సాగుకు ఎకరానికి విత్తనాలు వేయడానికి రూ. 4,000 నుంచి రూ. 5,000 వరకు అవుతున్నాయి. అదేవిధంగా పసుపుకు రూ. 5000 నుంచి రూ. 7,000 వరకు అవుతున్నాయి. కానీ అదే ఎకరం మొక్కజొన్న విత్తనాలు ట్రాక్టర్ తో వేయడానికి రూ. 2000, పసుపు వేయడానికి రూ. 3500 ఖర్చు మాత్రమే అవుతున్నాయి. దీంతో సమయం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా సగానికి తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మినహా మైదానంలో రైతులంతా ట్రాక్టర్లు డ్రోన్లు,తదితర యంత్రాలపైనే వ్యవసాయం చేస్తున్నారు. అన్ని రకాల విత్తనాలు యంత్రాలతోనే నాటుతున్నారు. పంట పొలాల్లో పురుగుల మందుల పిచికారి, ఎరువులు చల్లడం, విత్తనాలను వేయడం వంటి తదితర పనులకు రైతులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. సేద్యానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారిన తరుణంలో దాన్ని అధిగమించేందుకు అన్నదాతలు డ్రోన్లు ఉపయోగిస్తున్నారు. అదిలాబాద్ జిల్లాలో కొందరు యువకులు వ్యవసాయంపై అవగాహన కోసం హైదరాబాదు లాంటి పట్టణ ప్రాంతాల్లో శిక్షణ పొంది డ్రోన్లు కొనుగోలు చేసుకుని ఆయా గ్రామాల్లో రైతులకు సేద్యం అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. రోజుల శిక్షణ తీసుకున్న అనంతరం ఐదు లక్షలతో డ్రోన్లు కొనుగోలు చేసి పంట పొలాల యజమానులకు సంప్రదించి పురుగు మందు పిచికారి కోసం కిరాయిలకు ఇస్తున్నారు. డ్రోన్ల ద్వారా సమయంతో పాటు పురుగుమందులు వృధా కాకుండా ఉంటాయని రైతు గంగారెడ్డి చెప్పారు.చేతి పంపు ద్వారా పిచికారి చేస్తే ఎకరానికి అయ్యే ఖర్చులలో డ్రోన్ ద్వారా పిచికారి చేస్తే సుమారు రూ. 1000 ఆదా అవుతాయని, 20 నిమిషాలలో ఎకరం పొలానికి పురుగుమందు పిచికారి చేయవచ్చు అని అన్నారు.

# కాంగ్రెస్ పాలనలో మెడికల్ కళాశాలల భవిష్యత్ గందరగోళం

పాలన వదిలేసి ప్రతీకార చర్యలతోనే ఈ దుస్థితి.
ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలి.
జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత



**జగిత్యాల :** జగిత్యాల మెడికల్ కాలేజీలో మౌలిక వసతులు లేక జాతీయ వైద్య మండలి నోటీసులు జారీ చేయాదంతోనే రాష్ట్రంలోని మెడికల్ కళాశాల ల పరిస్థితి గందరగోళంగా మారిందని తాజా మాజీ జడ్పి చైర్మన్ దావ వసంత అన్నారు. జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూబిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వం మెడికల్ కాలేజీల భవితవ్యం రేవంత్ రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారిందనీ అన్నారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజ్ కు నోటీసులు రావడం సిగ్గుచేటు అని అన్నారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీ తో పాటు 26 మెడికల్ కాలేజీల్లో నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు వసతులు లేకపోవడంపై ఈ నెల 18 న ఎన్. ఎమ్. సి ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈ కి నోటీసులు ఇవ్వడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం అని అన్నారు. 2014లో స్వరాష్ట్రం ఏర్పడ్డ నాటికి తెలంగాణలో ఐదు ప్రభుత్వ ,15 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు వాటిలో 2850 ఎంబిబిఎస్ సీట్లు మాత్రమే ఉండేవి అని అన్నారు తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కో జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో 2023 అక్టోబర్ నాటికి మొత్తం కళాశాలల సంఖ్య 56 సీట్ల సంఖ్య 8340 కి చేరింది అప్పటికి కెసిఆర్ ప్రభుత్వం మరో 8 మెడికల్ కాలేజ్లు మంజూరు చేయడంతో మొత్తం సీట్ల సంఖ్య 9140 కి చేరిందన్నారు. కానీ కెసిఆర్ సంకల్పానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పోడుస్తుందని అన్నారు. వైద్య కళాశాలలో కనీసం వసతులు కల్పించలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు.కెసిఆర్ నాయకత్వంలో మొదటి జగిత్యాల మెడికల్ కాలేజ్‌కు పెర్మిషన్ వచ్చింది ఇవాళ కనీసం కనీస అవసరాలు లేని దుస్థితి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లోఎందుకు వచ్చింది ఇప్పుడు ఉన్న నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదు అని ప్రశ్నించారు. అప్పట్లో జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజీ వస్తదా అని అన్న నాయకులు కేసీఆర్ సారధ్యంలో కల్వకుంట్ల కవితక్క కృషి తో జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజీనీ సాధించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు హయాంలో మెడికల్ కాలేజీకు అన్ని అనుమతులు సాధించుకున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలైనా కూడా కేసీఆర్ గారిని విమర్శిస్తూనే ఉన్నారు కానీ పాలన మీద దృష్టి సాదించడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి ప్రతికార రాజకీయాలు చేస్తున్నారని ఇప్పటికైనా కళ్ళు తెరిచి జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీకి కావలసిన నిధులు విడుదల చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ఎన్. ఎమ్. సి నిబంధనలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థి జీవితాలను నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేష్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రావు, రిజ్వాన్, అనురాధ, బాలే చందు పాల్గొన్నారు.

## భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి



**జగిత్యాల :** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు.శుక్రవారం మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు.ఆంతకుముందు మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సంధర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు పాఠ్యాంశం బోధన (ఐఎఫ్పీ) ఇంటర్ యాక్ట్ ప్లాంట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు బోధించేటప్పుడు తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని జిల్లా కలెక్టర్ విద్యా బోధన ను గమనించారు .పాఠశాల విషయాల గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు.వంటగది సామాగ్రి పప్పు దినుసులు వంట నూనె సంబంధించినవి నాణ్యత పరిమాణాలతో ఉండాలని, పిల్లలకు మంచి భోజనం అందించాలి సూచించారు.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నీరు నిలువ ఉండకుండా చూడాలని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఈవో రామ్, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి,తహసిల్దార్ మునీందర్,ఎంపీడీవో పద్మావతి,సంబంధిత అధికారులు, రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కవితక్కకు మళ్లీ కోపం వచ్చింది



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే నామినేషన్లు వేయనిస్తాం. లేదంటే ప్రతి వార్డులో వందల సంఖ్యలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తాం" అని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ, మండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని, పార్లమెంటులో ఈ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. "జులై రెండో వారం వరకు కేంద్రానికి గడువు ఇస్తున్నాం. ఆలోపు అనుమతి రాకపోతే జులై 17 నుంచి రైలు రోకోలు నిర్వహిస్తాం" అని కవిత హెచ్చరించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అడ్డుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ కగార్" పైన కూడా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఎన్‌కౌంటర్లు అమానవీయ చర్యలని, ఈ ఆపరేషన్‌ను తమ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. మావోయిస్టు సమస్యకు చర్చలే పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

## కళ్యాణ లక్ష్మి, షాధి ముబారక్ సీఎంఆర్ చెక్కులు పంపిణీ



**కోరుట్ల :** పట్టణంలోని కల్లూర్ రోడ్డు లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణ, మండలానికి సంబంధించిన 1 కోటి 7 లక్షల 12 వేల 412 రూపాయల విలువ గల 107 కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కలను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.. అలాగే పట్టణ, మండలానికి చెందిన 10 లక్షల 54 వేల రూపాయల విలువగల 37 ముఖ్యమంత్రి సహా నిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు..అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటి దురద అరాచకాల వల్ల రాష్ట్రంలో ఆదాయం తగ్గిందన్నారు.. 2014 ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు నెలకు 4వేల కోట్ల ఉన్న ఆదాయాన్ని భారత రాష్ట్ర సమితి పార్టీ అట్టి ఆదాయాన్ని 18 వేల కోట్లకు వచ్చిందని మళ్లీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆదాయం తగ్గిందని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలన్నీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశ పెట్టినవేమన్నారు.. కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకపోవడం చాలా బాధాకమన్నారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు చీటీ వెంకట్రావు, నాయకులు ఫహీం,హఫీజ్, భాస్కర్ రెడ్డి, ఖయ్యుం, అంజయ్య, సందయ్య, నాయకులు, కార్యకర్తలు, కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిది లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు






# బెల్లంపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం





ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపైన అవగాహన కలిగి ఉండాలి..

బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ మహేందర్

**బెల్లంపల్లి,జూన్18(సూర్యరేఖ)**ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి 2టౌన్ పోలీసులు కాల్ టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వర్తించే విధులను విద్యార్థులకు వివరించడమే కాకుండా,వారితో కలిసి ట్రాఫిక్ నియంత్రణను నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు,హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు మైనర్ డ్రైవింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలు వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించే విధంగా వినూత్న ప్రయత్నం చేశారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి 2 టౌన్ ఏఎస్ఐ మహేందర్ తిరుపతి,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట 1గనిలో కార్మికుల తీవ్ర ఇబ్బందులు

గని మేనేజర్ శంకరయ్యకు వినతి పత్రం అందజేత..



**బెల్లంపల్లి,జూన్18 (సూర్యరేఖ)** కాసిపేట1గనిలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని,పని స్థలాలలో కార్మికుల పై ఒత్తిడి పెంచుతుందని గని మేనేజర్ శంకరయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ. కార్మికులకు పూర్తిగా స్వేచ్ఛ లేకుండాపోతుందని అండర్ గ్రౌండ్ లో పనిచేసిన కార్మికులకు రక్షణ కరువైపోయిందని ఆరోపించారు.అండర్ గ్రౌండ్ లో పనిచేసే కార్మికులకు గాలి సరిగా రావటం లేదని,దానితో కార్మికులు ఊపిరి తీసుకోడానికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రావెలింగ్ రోడ్లు సరిగా లేవు వాటిని యాజమాన్యం పట్టించుకోవడంలేదని,పనిచేసే వారికి ఇన్ ఫేసులకి దగ్గరగా తగిన సామాను అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. లైన్మెన్లు, సపోర్ట్ సిబ్బందికి సామాను అందుబాటులో లేక దూరం ఉండడం వల్ల కార్మికులకు అవస్థకు గురవడం జరుగుతుందన్నారు.కోల్ కట్టర్లకు సర్ఫేస్ నుండి మొదలుపెడితే మ్యాగ్జిన్ కు వెళ్లి మందు డబ్బా తీసుకువచ్చే క్రమంలో దానికి లాక్ సిస్టం లేకపోవడంఫేస్ లో ఉల్లు కోసే రాడు నాణ్యత లేకపోవడం,బిట్ల నాణ్యత లేకపోవడం,బిట్లు సరిగా పట్టకపోవడం, ఇబ్బందికరంగా మారిందన్నారు.ఇంకా కాసిపేట 1ఏ మైన్ గురించి అయితే చెప్పనవసరం లేదు. ట్రావెలింగ్ నడక దూరంగా ఉండడం ఆ ట్రావెలింగ్ రోడ్డు గుంతలు,గుంతలుగా ఉండడం గాలి మాత్రం నామమాత్రంగా ఉండడం,ఫేసులో కార్మికులకు అసలు గాలి అందకపోవడం.కోల్ కట్టర్లు ఉల్లు కోసే సమయంలో ఫేస్ లో నుండి నీళ్లు కూడా తొలగించకుండా అదే నీళ్లలో బురదలో కట్టర్లతో పని చేయించడం,పనికి తగిన పనిముట్లు లేకపోవడం కార్మికుడు అలసిపోయి నీళ్లు తాగుదామని వెళితే పంపు అందుబాటులో ఉండకపోవడం వంటి బందులు ఎదుర్కొంటున్నారన్నారు.అందులో నీరు రాకపోవడం వర్కింగ్ పేస్ లలో గాలి సరిగా లేక అండర్ గ్రౌండ్లో చెమటలతో తడిసిపోతున్న కూడా యజమాన్యం లెక్కచేయడం లేదన్నారు. నడక దూరం ఉన్నా కూడా నడిచి కాళ్ళు అరిగిపోతున్నాయి,కాళ్ళ కీల్లు అరిగిపోయి అవస్థకు గురి అవుతున్నారు. మోకాళ్ళ నొప్పులు వస్తున్నాయి అండర్ గ్రౌండ్ లో అలసిపోయి వచ్చిన కార్మికులు రెస్టు తీసుకుందామంటే రెస్ట్ హాల్ కూడా లేకపోవడం చాలా ఇబ్బందికరంగా మారింది.ఈ వర్షాకాలం సమయంలో ఎక్కడో ఒక దగ్గర కూర్చుందాం అని వెళ్తే విషపూరితమైన పాములు విషపూరిత మైన తేళ్లు తిరగడం జరుగుతుంది. కార్మికులు రెస్టు తీసుకునే విధంగా వెంటనే రెస్ట్ హాల్ నిర్వహించాలి,ఫేస్ లో పనిచేస్తున్నప్పుడు కోల్ కట్టర్ కార్మికులు ఫేస్ లో నీళ్లు బురద ఉందని అధికారులకు చెప్తే వాళ్ళు పట్టించుకోకుండా మేము చెప్పినట్లు పనిచేయాలి లేదంటే సస్పెండ్ చేస్తాం,చార్జి షీట్ ఇస్తాం అని బెదిరించడం జరుగుతుందని తెలిపారు.ఇలా చెప్పుకుంటూ పోతే కాసిపేట 1గనిలో చీమల పుట్ట లాగా ఎన్నో సమస్యలు ఎదుర్కోవడం జరుగుతుందని వెల్లడించారు. యాజమాన్యం వెంటనే ఈ సమస్యల పైన దృష్టి పెట్టి అలాగే ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిపైన తక్షణమే చర్యలు తీసుకొని కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కార్మికులు మేనేజర్ కు వినతి పత్రం అందజేసి సమస్యలను వెంటనే తీర్చాలని కోరారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు..

ఎమ్మెల్యే మదన్మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు.



**కామారెడ్డి,జూన్18(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే మదన్మోహన్ ఆధ్వర్యంలో బుధవారం లింగంపేట మండలం లింగంపేట్ సొసైటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంగమేశ్వర్,కొయ్యగుడ్డ తండా మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గత పాలకులు 20 సంవత్సరాలుగా చెయ్యని అభివృద్ధి ఎమ్మెల్యే 18 నెలలో చేసి చూపించారన్నారు.3500 ఇందిరమ్మ ఇల్లు మంజురు చేయడం జరిగింది.గతంలో ఎన్నడు లేని విధంగా 50 కోట్ల నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది.ప్రతి ఒక్క గ్రామంలో బోర్లు వేసి త్రాగు నీటి సమస్యను తీర్చారు.ముఖ్యంగా లింగంపేట మండలంలో భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్ట్ తీసుకుని వచ్చి రైతుల భూసమస్యలు తీరుస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు మదన్మోహన్ కృషితో ముందుకు వెళుతుందన్నారు. ఎమ్మెల్యే మదన్మోహన్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ బీజేపీ పార్టీలకు రాజీ నామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాలో మాజీ జెడ్పిటి సంతోష్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్,పార్టీ నాయకులు తుమ్మలపల్లి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ,పార్టీ సీనియర్ నాయకులు గోకుల్ సాయిరాం, సురాయిపల్లి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి,పోల్కంపేట్ సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ..

ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు



**కామారెడ్డి,జూన్18(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సూర్యపేట్ కు చెందిన వాసా జానయ్య వీరమ్మ,భవిరిశెట్టి విశాలాక్ష్మి జ్ఞాపకార్థం ఐవిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసా రాజేంద్రప్రసాద్ సహకారంతో 10వేలు విలువైన నోట్ బుక్స్ ను పంపిణీ చేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ...వాసా రాజేంద్రప్రసాద్ వారి అమ్మానాన్నలు,అత్తమ్మల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఆరు లక్షల రూపాయల విలువైన వివిధ రకాల సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.దానిలో భాగంగానే ఈ సంవత్సరం 30 వేల నోటు పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలు, అనాధాశ్రమాలలో పంపిణీ చేస్తున్నారని దానిలో భాగంగానే కామారెడ్డి జిల్లా కేంద్రానికి పంపడం జరిగిందని వారికి ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా,ఐవిఎఫ్ సేవాదళ్ తెలంగాణ విభాగం తరపున అభినందనలు తెలియజేశారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి పేద వారికి సహకరించాలని ఆకాంక్షించారు.

## జిహెచ్ఎంసి సర్కిల్ 13టౌన్ ప్లానింగ్ ఏసిపి ఆకస్మిక మరణం..

సిబ్బంది సంతాపం..



**నాంపల్లి,హైద్రాబాద్,జూన్18 (సూర్యరేఖ)** జిహెచ్ఎంసి సర్కిల్ 13 కార్వాన్ సెక్షన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఎం.సుమన 51 అనారోగ్యంతో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో యూసుఫ్ గూడాలోని తన ఇంట్లో ఆకస్మికంగా మృతి చెందారు.జిహెచ్ఎంసి కార్వాన్ సర్కిల్ 13 లో టౌన్ ప్లానింగ్ ఏసీపీగా సుమన ఆరు నెలల క్రితం నియమితులయ్యారు. కొంతకాలంగా ఆమె క్యాన్సర్ వ్యాదితో బాధపడుతున్నారాని తెలసింది. సోమవారం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి రాగా మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం జిహెచ్ఎంసి సర్కిల్ 13లోని టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో విషాదఛాయలు అలముకున్నాయి.జిహెచ్ఎంసి సర్కిల్ 13 టౌన్ ప్లానింగ్ ఎసిపి సుమన మృతి పట్ల డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తదితర సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## కల్వకుంటలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ..

ఎంపీడీవో రాజిరెడ్డి..



**నిజాంపేట,జూన్18(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికై స్థానిక ఎంపీడీవో రాజిరెడ్డి,ముగ్గు పోయించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఎంపికైనటువంటి లబ్ధిదారులకు భూమి పూజ కార్యక్రమం చేపట్టామన్నారు. త్వరతగతిన పూర్తి చేయాలని సదర్ కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కవిత,ప్రశాంత్ గౌడ్,మహేందర్ రెడ్డి,భాస్కర్ గౌడ్,రంగ నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన..





**ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ..**
**ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జూన్18 (సూర్యరేఖ)**ఉప్పల్ శాంతినగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాలలో పాఠ్యపుస్తకాలను ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు.విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. ఏదైనా సాధించాలనుకుంటే అది చదువుతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు.అదేవిధంగా పాఠశాలకు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేసిన ఉపాధ్యాయులకు,సహకరించిన తల్లిదండ్రులను ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి అభినందించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించి సర్వనాశనం చేసిందని ఈ సందర్భంగా కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఆరోపించారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యపైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.పాఠశాల తరగతి గదులు తెరుచుకోకముందే విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు, దుస్తులను పాఠశాలకు చేరాయన్నారు.విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టిన ప్రత్యేక దృష్టికి నిదర్శనమన్నారు.ఉప్పల్ లో పేద విద్యార్థులకు భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అందరి సహాయ సహకారాలతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు అందుతున్నాయని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు భోజనం,విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే పోటీతత్వం ఉంటుందని ప్రైవేటు బడులను ప్రైవేటు పాఠశాలల వైపు కన్నెత్తి చూడకుండా ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు జోషి ,డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్ లింగంపల్లి రామకృష్ణ,తుమ్మల దేవిరెడ్డి,సల్ల ప్రభాకర్ రెడ్డి,ప్రేమ్,అలుగుల అనిల్ కుమార్, అల్వాల్ భాస్కర్,జనగాం రామకృష్ణ అనిత రుత మాం సుశీల ఉమ,బల్మల,నాగారం వెంకటేష్ కుశంగుల సతీష్ ముదిరాజ్,వెంకటేష్ సెట్ ప్రశాంత్ రెడ్డి,బజార్ నవీన్ గౌడ్,బొడిగె మల్లేష్, మోహన్ వంశిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభకు పాత్రికేయులు తరలిరండి




**మంచిర్యాల,జూన్18(సూర్యరేఖ)** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మంచిర్యాల జిల్లా తృతీయ మహాసభ ఈనెల 20వ తారీఖున నస్పూర్ లోని ప్రెస్ క్లబ్ లో తలపెట్టిన మహాసభకు జిల్లాలోని పాత్రికేయులు తరలిరావాలని ఫెడరేషన్ జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మధు, కో-కన్వీనర్లు కె.వెంకటస్వామి,సత్యగౌడ్,లు కోరారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభకు పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు ఫెడరేషన్ రాష్ట్ర,జాతీయ నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. జిల్లాలో సంఘం నిర్మాణం,సభ్యత్వం, జర్నలిస్టుల హక్కులు సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిచనున్నట్లు తెలిపారు.గత వారం రోజులుగా జిల్లాలో విరివిగా సభ్యత నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న విలేకరులు స్వచ్ఛందంగా సంఘంలో సభ్యత్వం తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు.రాష్ట్ర కమిటీ ఇచ్చిన బాధ్యతను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని అన్నారు.ఈ మహాసభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్యతో పాటు రాష్ట్ర ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు హాజరు కానున్నట్లు తెలిపారు.జిల్లాలోని పాత్రికేయ మిత్రులను మహాసభకు సాధారణంగా ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు.జిల్లాలోని ఫెడరేషన్ సభ్యులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు భాస్కర్,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ లో పాల్గొన్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు






**ఉప్పల్,జూన్18 (సూర్యరేఖ)** రాబోయే వర్షాకాల నేపద్యంలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కి సంబంధించిన ప్రోగ్రాంలో చివరి రోజు బుధవారం డివిజన్లోని కామాక్షి పురం,వివేక్ నగర్,లో రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొని స్థానిక పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి ప్రజలకి సూచించారు. వర్షాకాలంలో ప్రజలు పరిసరాలు ప్రాంతాలని పరిశుభ్రంగా ఉంచుకొని శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు.శానిటేషన్ సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సీనియర్ మాజీ కౌన్సిలర్ చింతోజు శ్రీనివాసచారి, కాలనీ మాజీ అధ్యక్షులు తమ్మలిరవి,కాలనీ ప్రధాన కార్యదర్శి నారాయణదాసు,కల్మ కళ్ళ లింగం,రాజ్ కుమార్ నరేందర్,వివేక్ నగర్ అధ్యక్షులు అశోక్ రాజా ఎస్ఎఫ్ఏ బాబురావు,జిహెచ్ఎంసి సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

## నమ్మక ద్రోహులకు పార్టీలో స్థానం లేదు..

**ఠాకూర్ జీవన్ సింగ్**



**నాంపల్లి,హైద్రాబాద్,జూన్18 (సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల డొల్లతనం ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ కార్వాన్ నియోజకవర్గం ముఖ్యనాయకులకు దిశానిర్దేశం చేశారు.బుధవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.నమ్మక ద్రోహులకు పార్టీలో స్థానం లేదని,ఐకమత్యంగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

## తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ యూనియన్

**ప్రధాన కార్యదర్శిగా ఇలిటం నరసింహారెడ్డి నియామకం**



**ఉప్పల్,జూన్18(సూర్యరేఖ)** తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్ ఓనర్ అసోసియేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఇలిటం నరసింహారెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు అధ్యక్షులకు కొండ గోపాల్ రెడ్డి నియమించారు.ఈ సందర్భంగా ఇలిటం నరసింహారెడ్డి మాట్లాడుతూ. ప్రధాన కార్యదర్శిగా నన్ను నియమించిన అధ్యక్షులు కొండ గోపాల్ రెడ్డి, అసోసియేషన్ ప్రతిదులు ఆనంద్,రెడ్డప్ప, రామ్మోహన్ గౌడ్,సోమయ్య రమణారెడ్డి,మధు బాల్ రెడ్డి,రాజిరెడ్డి,మల్లేశం,కమిటీ సభ్యులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.నాకు బాధ్యత అప్పగించిన అసోసియేషన్ మిత్రులకు రుణపడి ఉంటానని,నా వంతుగా ఎలాంటి సమస్యలు వచ్చినా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని బాధ్యత అప్పగించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నరసింహారెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

## పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు..

**వివరాలు వెల్లడించిన మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్**



**మేడ్చల్,జూన్18(సూర్యరేఖ)** పుణ్యక్షేత్రాలకు మేడ్చల్ బస్ డిపో నుండి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. మేడ్చల్ బస్ డిపోలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎండి సూచనల మేరకు మేడ్చల్ బస్సు డిపో నుండి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సౌకర్యం ఈ నెల 27 నుండి ప్రారంభమవుతుందని చెప్పారు.ఉదయం ఐదు గంటలకు మేడ్చల్ బస్సు డిపో నుండి కాలేశ్వరం, రామప్ప,భద్రకాళి,వేయి స్తంభాల గుడి దర్శన అనంతరం మేడ్చల్ బస్సు డిపోకు తిరిగి రాత్రి 10 గంటలకు బస్సు చేరుకుంటుందని తెలియజేశారు. ఇందుకు సంబంధించిన టికెట్ ధరలు పెద్దలకు రూ. 1200 కాగా,పిల్లలకు రూ.600 ఉంటుందని చెప్పారు.కాగా వారంలోని చివరి రోజుల్లో ఈ సర్వీసులు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ సౌకర్యాన్ని మేడ్చల్ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సుధాకర్ కోరారు. మరిన్ని వివరాల కొరకు 9849737131ను సంప్రదించాలని కోరారు.

# ఉప్పల్ లో జర్నలిస్టు సురేష్ సంస్మరణ సభకు తరలివచ్చిన నాయకులు





**జర్నలిస్టు సురేష్ సేవలను కొనియాడిన నాయకులు**
**జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేయాలి..**
**ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్**
**జర్నలిస్టుల సేవలు మరువలేనివి..**
**ఎన్ విఎస్ఎస్**
**జర్నలిస్టులకు అండగా ఉంటా..**
**రాగిడి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జూన్18 (సూర్యరేఖ)** ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన జర్నలిస్టు మాదిరాజు సురేష్ సంస్మరణ సభకు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులు, హాజరయ్యారు. బుధవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేకేఆర్ గార్డెన్ లో నిర్వహించిన సంస్మరణ సభకు ప్రముఖులు హాజరై జర్నలిస్టుగా సురేష్ చేసిన సేవలను కొనియాడారు.ఉప్పల్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సురేష్ చేసిన సేవలను అభినందించారు. నాయకులు మాట్లాడుతూ...సురేష్ తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండే జర్నలిస్టు సురేష్ మృతిని ఎవరు జీర్ణించుకోలేక పోతున్నారని,ఉప్పల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సురేష్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన సూచించారు.సురేష్ కుటుంబానికి తన వంతుగా ప్రభుత్వంలోని పెద్దలతో చర్చించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు.సురేష్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ. ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్ట్ సురేష్ ఎంతో చురుకుగా ఉండేవాడని కొనియాడారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ నిర్మాణంలో తాను ఎంతో సహకరించాలని,అదేవిధంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సురేష్ కూడా ఎంతో చొరవ చూపే వారని గుర్తు చేశారు.మల్కాజ్గిరి పార్లమెంటు బీఆర్ఎస్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... జర్నలిస్టులు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతూనే దుర్భరమైన ఆర్థిక పరిస్థితుల్లో తమ జీవనాన్ని నెట్టుకు రావడం బాధ కలిగిస్తుందన్నారు. జర్నలిస్టులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని యావత్ సమాజం కూడా అండగా నిలవాలని కోరారు.జర్నలిస్టు సురేష్ కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు.ఉప్పల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మేకల శివారెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ జర్నలిస్టులు నిస్వార్థంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడతారని పేర్కొన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,సాయి జన్ శేఖర్ గంధం నాగేశ్వరరావు,లు మాట్లాడుతూ. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు నాయకులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని అభినందించారు.జర్నలిస్టులకు అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని వారు గుర్తు చేశారు.ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సురేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని,ఆర్థికంగా ఆదుకుంటామని వారు పేర్కొన్నారు.ఈ సంస్మరణ సభకు సురేష్ సతీమణి కూతురుతో పాటు కుటుంబ సభ్యులు హాజరయ్యారు.ఈ సంస్మరణ సభలో పాల్గొన్న వారిలో ఉప్పల్ గ్రామ ప్రముఖుడు బండి నరసింహారెడ్డి,బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,సాయి జన్ శేకర్,మేకల మధుసూదన్ రెడ్డి,గుడి మధుసూదన్ రెడ్డి లేతాకుల రఘుపతి రెడ్డి,అన్య బాలకృష్ణ ఏ.మోహన్ రెడ్డి,పిల్లి నాగరాజు, కొండల్ రెడ్డి,పల్లె నర్సింగరావు,పిట్టల నరేష్,ఈరెల్లి రవీందర్ రెడ్డి,కే.జగన్,సుక్క కిరణ్,నిరంజన్,పంగ మహేందర్ రెడ్డి,తెలంగాణ సంపత్,సుధాకర్ శెట్టి, చర్ల సుధాకర్ రెడ్డి,వైఎస్ఆర్ టిపి నాయకురాలు కల్పనా గాయత్రి,సిపిఎం నాయకులు ఎర్రం శ్రీనివాస్, వినోద,ఊర్మిళ,అదేవిధంగా ఈ సమావేశంలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు,ఉప్పల్ తహసిల్దార్ వాణిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సునీల్,ఇతర మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

**-జర్నలిస్టుల నివాళి**
**మీడియా అకాడమీ నుంచి ఆర్థిక సహాయం :**
**టి యు డబ్ల్యు జే**

ఆకస్మికంగా మృతి చెందిన ప్రజా దర్బార్ పత్రిక రిపోర్టర్ మాదిరాజు సురేష్ జ్ఞాపకార్థం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేకేఆర్ గార్డెన్ లో నిర్వహించిన సంస్మరణ సభలో జర్నలిస్టులు నివాళులర్పించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోత వెంకటరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, కార్యదర్శి దొంతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సురేష్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వ మీడియా అకాడమీ నుంచి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని సాధ్యమైనంత త్వరలో వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అతని కుటుంబానికి మీడియా అకాడ నుంచి ప్రతినెల రూ 3000 పెన్షన్ అందుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. జర్నలిస్టు సురేష్ పనిచేసిన ప్రజా దర్బార్ పత్రిక యాజమాన్యం, ఎడిటర్ బొంగులూరి వేణుగోపాల్ శర్మ తన సంస్థ నుంచి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని సురేష్ కుటుంబానికి అందజేశారు. జర్నలిస్టు సురేష్ సంస్మరణ సభ ను విజయవంతం చేయడంలో కృషిచేసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులందరిని టీయూడబ్ల్యూజే నాయకులు అభినందించారు.

# స్కూల్ వ్యాన్ ఆటోడ్రైవర్లను చలాన్ల పేరుతో వేధించవద్దు





**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జూన్18 (సూర్యరేఖ)** స్కూల్ వ్యాన్,ఆటో డ్రైవర్లను ఫైన్లు,చలాన్ల పేరుతో ఇబ్బందులకు గురి చేయొద్దని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి ఆర్టీఏ అధికారులతో మాట్లాడారు.ఆర్టీఏ అధికారులు తమను వేధిస్తున్నారని స్కూల్ వ్యాన్ ఆటో డ్రైవర్లు ఉప్పల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.స్పందించిన ఎమ్మెల్యే ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంకి వచ్చి ఎంవీఐలు రవీందర్ రెడ్డి,శిల్పాలతో మాట్లాడారు. వారిని ఇబ్బందుల గురి చేయవద్దని సూచించారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీఏ అధికారులు స్కూల్ వ్యాన్ ఆటో డ్రైవర్లను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.స్కూల్ డ్రైవర్స్ కి అన్ని విధాలా అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డ్రైవర్స్,తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దు..

**గోదా లక్ష్మీకాంత్ యాదవ్**

**నాంపల్లి,హైద్రాబాద్,జూన్18(సూర్యరేఖ)** వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్ నుండి విత్తనాలు కొనుగోలు చేయాలని,నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని భారతీయ జనతా పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ గోదా లక్ష్మీకాంత్ యాదవ్ రైతులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీకాంత్ యాదవ్ మాట్లాడుతూ...రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాల సూచనల మేరకు మెలుకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని అన్నారు.ట్యాగ్ ఉన్న బస్తాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.విత్తన బస్తాపై,ప్యాకెట్లపై గడువు తేదీ,రకం పేరు,లాట్ నెంబర్లు చూసుకోవాలన్నారు. కొనుగోలు బిల్లుతోపాటు విత్తన రకం,గడువుతేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రశీదు తీసుకోవాలని సూచించారు.విత్తన కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.డీలర్లు చెప్పే ఆఫర్లు,మాయమాటలను నమ్మి మోసపోవద్దని కోరారు.విత్తనాలు పెట్టిన తరువాత కూడా రసీదులు,ఖాళీ ప్యాకెట్లు భద్రపరుచుకోవాలన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన..



**నిజాంపేట,జూన్18(సూర్యరేఖ)**మండల కేంద్రంలో బుధవారం ఎస్ఐ రాజేష్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ కాంతారావు ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు.మండలంలోని గ్రామ ప్రజలు సైబర్ మోసాలకు గురి కాకుండా,తెలియని నెంబర్ నుండి ఫోన్ వస్తే ఓటీపీ చెప్ప మని అడిగితే స్పందించవద్దన్నారు.ఎలాంటి ఏపీకె ఫైల్స్ ఓపెన్ చేయవద్దని అలాగే యువత చెడు వ్యసనాలకు గురి కావద్దని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చల్మెడలో నోట్ బుక్ లను అందించిన ఎంఈఓ



**నిజాంపేట,జూన్18(సూర్యరేఖ)** మండల పరిధిలో చల్మెడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి సాంగని యాదగిరి విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విలువలతో కూడిన విద్య అందుతుందని విద్యార్థులందరూ కూడా తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో చేరాలని సూచించారు. పాఠశాలకు చెందిన దేశపతి మోహన్ శర్మ 100 మంది విద్యార్థులకు 400పైగా నోటు పుస్తకాలను అందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్, ఉపాధ్యాయులు నవీన్, రత్నాకర్ మమత,జ్యోతిలక్ష్మి మమత,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట్ స్వామిని సెకరటేరియట్ లో కలసిన కైలాస్ శ్రీనివాస్ రావు



**కామారెడ్డి,జూన్18(సూర్యరేఖ)** జాహిరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేశ్ కుమార్ షెట్కార్,కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్,లు మంత్రి వివేక్ వెంకట్ స్వామిని బుధవారం సచివాలయంలో మంత్రి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రిని జహీరాబాద్ ఎంపీ.సురేష్ కుమార్.కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు,లు సన్మానం చేశారు. అనంతరం కైలాస్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం జరుగుతుందని శ్రీనివాస్ రావు తెలిపారు.

## బీజేపీ నూతన కమిటీని సన్మానించిన ఎంపీ ఈటెల రాజేందర్



**మేడ్చల్,జూన్ 18(సూర్యరేఖ)** మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజహరినాథ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మేడ్చల్ పురపాలక సంఘం కమిటీని మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శాలువా కప్పి సన్మానించారు.మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ...పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల ని సూచించారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు విక్రం రెడ్డి,ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,కమిటీ సభ్యులు జాకట ప్రేమ్ దాస్, ప్రధాన కార్యదర్శి మైసరి రాజు, సర్వేశ్వర రెడ్డి,బండి విష్ణుగౌడ్,సురేందర్‌రెడ్డి, సాయికుమార్,డి.నవీన్ కుమార్,ధాత్రిక లక్ష్మణ్, కోశాధికారి ఉపేందర్ గుప్త,కార్యవర్గ సభ్యులు దోసడి రామచంద్ర రెడ్డి,దగ్గు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ ఓల్డ్ విలేజ్ లో నీటి సమస్య తలెత్తకుండా మరమ్మత్తులు చేయాలి





**మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్**

**ఉప్పల్,జూన్18 (సూర్యరేఖ)**మల్లాపూర్ 5వ డివిజన్ లోని ఓల్డ్ మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల లైన్ నూతన రోడ్డు ప్రారంభం అవడంతో మంచినీటి పైపులైన్లు మరమ్మతులు చేయాలని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయికిరణ్ గౌడ్ అధికారులకు సూచించారు. రోడ్డు వేయకముందే మరమ్మత్తులు చేయాలని సమస్య తలెత్తదని పేర్కొన్నారు.ఏఈ శ్రీరాజ్ కాలనీ వాసులతో కలిసి ఆయన ఓల్డ్ మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల లైన్లో పర్యటించారు. మరమ్మత్తులు చేయాల్సిన ప్రదేశాలను చూపించి మరమ్మతులు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోయగూర బాలరాజ్ కాలనీ వాసులు శేఖర్,సంతోష్,ఐలయ్య,కార్తీక్, జంగయ్య,శివ,శ్రీకాంత్,శేఖర్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి మెడలోని గొలుసు అగాంతకుడు ఎత్తుకెళ్లాడని కొడుకు నాటకం

### పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే తీరా కొడుకే దొంగ..

### చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు



**మందమర్రి,జూన్18(సూర్యరేఖ)** అభిమానంతో బంగారు గొలుసును మెడలో వేసి తల్లికి సర్ప్రైజ్ ఇస్తాడు ఏ కొడుకైన..కానీ అందుకు విరుద్ధంగా తల్లి గొలుసును దొంగిలించి ఎవరో అగాంతకుడు నాతల్లి మెడలోని గొలుసును లాక్కెళ్లాడని నాటకం ఆడాడు.గొలుసు చోరికి గురైందని వృద్ధురాలి మనువడు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా చాకచక్యంగా దర్యాప్తు చేసిన మందమర్రి పోలీసులు చివరకు కొడుకునే ముద్దాయిగా తేల్చారు.చేసిన అప్పులను తీర్చేందుకు ఏకంగా తల్లి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించి పోలీసులకు చిక్కి చివరకు కటకటాల పాలయ్యాడు.కేసు పూర్తి వివరాల్లోకి వెళితే పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో నివాసముంటున్న విజయపురి పుల్లమ్మ (76)అనే వృద్ధురాలు,అనారోగ్యానికి గురై మంచంలో ఉన్న సమయంలో గత నెల 24వ తారీఖు రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో వృద్ధురాలి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడని ఆమె మనువడు శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు,ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి,ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు.ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ,తమ సాంకేతికతతో పాటు మానవ వనరుల పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టగా,బయటి వ్యక్తులు ఈ నేరం చేసి ఉండరని పోలీసులు అనుమానించారు. ఈ క్రమంలో వృద్ధురాలి కుమారుడు విజయపురి శంకరయ్య (65) ప్రవర్తనపై అనుమానం రావడంతో అతన్ని తమదైన శైలిలో విచారించగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా తానే తన తల్లి మెడలోని బంగారు గొలుసును దొంగిలించినట్లు శంకరయ్య తన నేరాన్ని అంగీకరించాడు.దొంగతనాన్ని కప్పిపుచ్చుకోవడానికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఈ దొంగతనానికి పాల్పడ్డారని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశానని నిందుతుడు తెలిపాడు.చోరీ చేసిన రెండు తులాల బంగారు గొలుసును నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్ కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన మందమర్రి ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి,ఎస్సై రాజశేఖర్,క్రైమ్ టీం కానిస్టేబుళ్లు మహేష్,రాకేష్‌లను రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డిసిపి,బెల్లంపల్లి ఎసిపి లు ప్రత్యేకంగా అభినందించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది





**నరసింహనగర్ కాలనీలో రూ.7.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు**

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జూన్18(సూర్యరేఖ)** మీర్ పెట్ హెచ్ బికాలనీ డివిజన్ లోని నరసింహనగర్ కాలనీలలో రూ.7.50 లక్షలతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి,తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని,ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పూర్తీ స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని,అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే, డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స ఏఈ వేణుగోపాల్ కాలనీ ప్రెసిడెంట్ అరుణ్, రంగు ప్రసాద్,భానురి రాకేష్ విక్రమ్ వేణుగౌడ్, రామానుజం మనీష్ శ్యామ్ ఐలవేని రాజు, వాసుచారి నరసింహగౌడ్ సాయిగౌడ్ సతీష్, వెంకటేష్,బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి,నవీన్ రెడ్డి,కాలనీ నాయకులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కండక్టర్లు..

**మృతి చెందిన తోటి కండక్టర్ కుటుంబానికి ఆర్థిక సహాయం..**



**మేడ్చల్,జూన్18(సూర్యరేఖ)**మేడ్చల్ ఆర్టీసీ డిపో కండక్టర్లు తమ మానవత్వాన్ని చాటుకున్నారు.అంజమ్మ అనే తోటి కండక్టర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మిగతా కండక్టర్లు చందాలు వేసుకొని రూ.42 వేలను మృతురాలు అంజమ్మ కూతురు మానస వీణకు అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన కండక్టర్లను పలువురు అభినందించారు.

## కర్చల్ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలో బ్యాగ్యులు ఐడీ కార్డులు పంపిణి..

**అభినందన్ రెడ్డి**








**అందోల్,జూన్18(సూర్యరేఖ)** కర్చల్ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలో దాతల సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం,స్కూల్ బ్యాగ్స్,ఐడీ కార్డ్స్,లను సంఘ సేవకుడు డాక్టర్ పి.అభినందన్ రెడ్డి అందజేశారు. అలాగే పాఠశాల విద్యార్థులందరికి స్కూల్ బ్యాగ్స్ ఎం.రాజు ఎం.సందీప్ పి.ప్రభాకర్,ఎ.సుభాష్,ఎన్. ప్రభాకర్,కె.విష్ణుగౌడ్ ముందుకొచ్చి అందించారు. ఐడీ కార్డ్స్,లు హైమద్ విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాయికోడ్ మండల విద్యాధికారి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు,పంచాయితి సెక్రెటరీ,మాజీ సర్పంచ్లు శ్రీనివాస్ రెడ్డి,బద్రి ప్రసాద్,గ్రామ పెద్దలు, ప్రజలు మహిళలు,యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ముందుంటాం..

**రాజేంద్రనగర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.మహేష్**





**రాజేంద్రనగర్,జూన్18(సూర్యరేఖ)**అత్తాపూర్ డివిజన్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.మహేష్ అన్నారు.బుధవారం అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు గొంది ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను టీచర్ల ద్వారా అందజేశారు.పేద విద్యార్థులను స్కూల్లో చేర్చుకోవాలని విజ్ఞప్తి చేస్తూ స్కూల్ పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీలతను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.రవీందర్ కుమార్,అత్తాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సులిగే మహేందర్,ఎం.విజయ్ కుమార్ గౌడ్ కృష్ణమూర్తి,శ్రీనివాస్ సాగర్, పిటి.రంగారెడ్డి,సాయి ప్రసాద్,సురేష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఆటో నుండి పడి విద్యార్థి రిహాన్ మృతి






**బెల్లంపల్లి,జూన్18 (సూర్యరేఖ)** ఆటో నుండి పడి విద్యార్థి రిహాన్ (6)మృతి చెందాడు.వివరాల్లోకి వెళ్తే బెల్లంపల్లి పట్టణం బాపూక్యాంపు బస్తిలోని ఎడ్ కేర్ పాఠశాలలో రిహాన్ (6) 1వ తరగతి చదువుతున్నాడు.స్కూల్ నుండి ఆటోలో ఇంటికి వస్తున్న సమయంలో సుభాష్ నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో పంది ఆటోకు అడ్డం వచ్చింది.పందిని తప్పించబోయి ఆటో కట్ చేయడంతో ఆటోలో కూర్చున్న రిహాన్ కింద పడిపోయాడు.దీంతో రిహాన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి తీవ్ర గాయాలైన రిహాన్ ను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రిహాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన కలుగుర సంతోష్ జ్యోతి,లకు ఇద్దరు సంతానం రిహాన్ పెద్దవాడు కూతురు సమన్వి కుమారుడు రిహాన్,మృతి చెందడంతో ఆసుపత్రిలో తల్లిదండ్రులు బోరుణ విలపించారు.ఈ మేరకు బెల్లంపల్లి 2టౌన్ ఎసై మహేందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆసుపత్రిని సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు..**

యాజమాన్యాలు ఫిట్నెస్ లేని వెహికల్లను ప్రైవేట్ చేస్తూ విద్యార్థులకు బస్సు కంటే తక్కువ రాయితీలో ఈ వెహికల్స్ ను అందజేస్తున్నామని తల్లిదండ్రులకు నమిస్తున్నారని విద్యార్థుల సంఘాలు ఆరోపించారు. లైసెన్స్ లేని డ్రైవర్లతో అధిక సంఖ్యలో వాహనాలలో విద్యార్థులను తరలిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.ఇదే సంఘటన బెల్లంపల్లి పట్టణంలో ఎడ్యుకేర్ హెడ్ కేర్ పాఠశాలలో జరిగింది.దీనికి పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాలని తెలిపారు. కుటుంబానికి న్యాయం చేయాలని ఈఎడ్ కేర్ పాఠశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి




## మున్సిపల్ కమిషనర్ రాయలింగు

**మందమర్రి,జూన్ 18(సూర్యరేఖ)** స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామిక వేత్తగా ఎదిగి స్వశక్తితో ఆర్థికంగా,సామాజికంగా రాణించాలని పురపాలక సంఘం కమిషనర్ తుంగపిండి రాయలింగు ఆకాంక్షించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమీషనర్ రాజలింగు హాజరై స్వయంగా వారు తయారు చేసిన ఉత్పత్తుల అమ్మక ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ...ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని తమ నైపుణ్యాలకు తగిన వ్యాపారాలను ఎంపిక చేసుకుని,పలువురికి ఉపాధి కల్పిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకారులు రుణాల అందించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలని సూచించారు.ఈ సందర్భంగా మెప్మా స్వయం సహాయక సంఘాలు స్వయంగా తయారు చేసిన దేశీ నెయ్యి,పచ్చళ్ళు,మిఠాయిలు బుట్టలు,మగ్గం వర్క్ మెటీరియల్,గోవు పేడతో చేసినటువంటి ఉత్పత్తులు పనికిరాని వస్తువులతో చేసినటువంటి ఉత్పత్తులు,వెదురు,వైరు బుట్టలను మెప్మా స్వయం సహాయక సంఘాలు ప్రదర్శించి అమ్మకాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పి. కృష్ణ ప్రసాద్,మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.సుమతి,సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ రాజు,జూనియర్ అసిస్టెంట్ వసంత్,రాజ్ కుమార్, పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు,వార్డ్ అధికారులు,ఇతర మున్సిపల్ సిబ్బంది,మెప్మా రిసోర్స్ పర్సన్ లు తదితరులు పాల్గొన్నారు.

# మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో వర్షాకాలాన్ని సమర్థంగా ఎదుర్కొంటాం





**ఎలాంటి సమస్యలు వచ్చినా మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కరిస్తాం..**

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జూన్18(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటానని వివరించారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ లేక్ వ్యూ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కాలనీలో జలమండలి,బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందుకు తలెత్తకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. భూగర్భ డ్రైనేజ్ లైన్ పూర్తి ఎత్తున లైన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అదే విధంగా మట్టి రోడ్డు ఉండడంతో వరదనీరు చేరుకొని చాలా ఇబ్బందులు గురవుతున్నారన్నారు.వెంటనే నూతన సివరేజ్ పై ప్రణాళికలు వేసి మంజూరుకు పంపాలని అదేవిధంగా నూతన సీసీ రోడ్లు పనులు ప్రణాళిక కూడా రూపొందించాలని,అదేవిధంగా నూతన పైప్ లైన్ మ్యాచ్ అయ్యే విధంగా దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.స్థానికంగా ఎక్కడ సమస్యలు ఎదురైనా తన దృష్టికి తేవాలని వాటి పరిష్కారానికి అన్ని విధాలా సహకరిస్తానని వివరించారు.ఈ కార్యక్రమంలో వాటర్ బోర్డు సూపర్వైజర్ ప్రసాద్,జీహెచ్ఎంసీ ఏఈ నరసింహ మూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ భాను,మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికె జనార్ధన్,సీనియర్ నాయకులు ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,మన్మోహన్ రెడ్డి,శర్మ,నర్సిరెడ్డి గయాదర్,అభిషేక్,తలారి చిన్న కొండల్ శంకర్, మధుసూదన్ రెడ్డి,స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముష్కిన్ చెరువు అభివృద్ధికి సంబంధించిన మ్యాప్ విడుదల..




**రాజేంద్రనగర్,జూన్18(సూర్యరేఖ)** హైడ్రా,హెచ్ఎండిఏ వారు చేపట్టిన మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ పరిధిలోని ముష్కిన్ చెరువు అభివృద్ధి పనులు కేవలం సర్వే నెంబర్ 258,259,260,లకే పరిమితమైందని అధికారులు తెలిపారు.ఈ మేరకు మ్యాప్ ద్వారా తెలియజేసినట్లు తెలిపారు.ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన విధంగా ఇతర సర్వే నెంబర్ 376,255,257,లకు సంబంధం లేదని మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు వివరించారు.

## ఎమ్మెల్సీ అంజిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొండలరావు



**శివంపేట,జూన్18(సూర్య రేఖ)**ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకన్నగారి కొండల్ రావు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కొండల్ రావు మాట్లాడుతూ..శివ్వంపేట మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.దానికి అంజిరెడ్డి తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసిన రెంటం కృష్ణారెడ్డి



**చేగుంట,జూన్18(సూర్యరేఖ)**ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు దాతలు తమ వంతు ఆర్థిక సాయం చేస్తున్నారు.ఈ క్రమంలో మాసాయిపేట మండలంలోని రామంతపూర్ గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు దాత రెంటం కృష్ణారెడ్డి బ్యాగులు,నోట్ పుస్తకాలు,విద్యా సంవత్సరానికి ఉపయోగపడే సామాగ్రిని బుధవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు..



**శివంపేట,జూన్18(సూర్యపేట)**శివంపేట్ మండలంలోని కొంతాన్ పల్లి గ్రామంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతిబాట రెవెన్యూ సదస్సులు భూభారతి చట్టం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల కరుణాకర్ రెడ్డి ప్రజలతో మాట్లాడుతూ...గ్రామంలోని భూసమస్యలు పూర్తిగా పరిష్కారం కానున్నా యని,గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కమలాద్రి చారి,డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ కిషన్,రెవెన్యూ సిబ్బంది రైతులు గ్రామస్తులు, సికెఆర్ యువసేన సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలోని కెన్సాస్ స్టేట్ యూనివర్సిటీతో తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఒప్పందం







**ఈ ఒప్పందంతో తెలంగాణ రైతులకు క్షేత్రస్థాయిలో ఆవిష్కరణలకు బీజం పడింది..**
**శ్రీకొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి**

**రాజేంద్రనగర్,జూన్18(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యాన విద్యార్థుల నైపుణ్య శిక్షణ పెంపొందింపు,లోతైన ఉద్యాన పరిశోధనల కోసం అండర్ గ్రాడ్యుయేట్,పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల పరస్పర మార్పిడి,అలాగే సంయుక్త పరిశోధన కోసం తెలంగాణలోని శ్రీకొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, అమెరికాలోని కెన్సాస్ స్టేట్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం చేసుకుంది.ఈ సందర్భంగా ఉద్యాన వర్సిటీ తరఫున శ్రీకొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం తరఫున వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి,కన్సాస్ స్టేట్ యూనివర్సిటీ తరఫున సెంటర్ ఫర్ క్లైమేట్,డ్రాప్స్,కమ్యూనిటీస్ డైరెక్టర్ డాక్టర్ పివి.వరప్రసాద్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందంతో తెలంగాణ రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే మరిన్ని ఆవిష్కరణలకు బీజం పడిందని,అలాగే రాష్ట్రం విద్యన రంగానికి అంతర్జాతీయ పరిశోధన ప్రమాణాలను పెంచే దిశగా విశ్వవిద్యాలయం ముందుకు వెళుతుందని వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు.పంట కోత అనంతరం పరిజ్ఞానం విలువల జోడింపు,సుస్థిర ఉద్యానరంగం, ఆధునిక ఆవిష్కరణలు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ , మిషన్ లెర్నింగ్,ఫుడ్ సేఫ్టీ అంశాలలో కన్సాస్ స్టేట్ యూనివర్సిటీ ముందుందని ఈ అవగాహన ఒప్పందంతో తెలంగాణ విద్యార్థులు,రైతులకు మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి అన్నారు అన్నారు.కెన్సాస్ స్టేట్ యూనివర్సిటీ డైరెక్టర్ పివి.వరప్రసాద్ మాట్లాడుతూ...అత్యంత ముఖ్యమైన సేఫ్టీ ఫుడ్, బయో సేఫ్టీ,క్రిస్ప్-క్యాస్9 వంటి ఆధునిక పరిశోధనల అనువర్తనాలను ఉద్యాన పంటల్లో ముఖ్యంగా కూరగాయలు,పండ్ల తోటల్లో ఉపయోగించి మేలైన పరిశోధన మేలైన ఫలితాలు పొందవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అగ్రి బయోటెక్ ఫౌండేషన్ చైర్మన్,వ్యవసాయ వర్సిటీ మాజీ ఉపకులపతి డాక్టర్ సురవరం రఘువర్ధన్ రెడ్డి, వర్సిటీ డీన్ డాక్టర్ జే.చీనా ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ శ్రీనివాసన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోతరాజు ప్రశాంత్ సుధాకర్ రెడ్డి,డాక్టర్ పిడియం సైదయ్య ప్రొఫెసర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జహీర్ పటేల్ జన్మదిన వేడుకలు





**అందోల్,జూన్18(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం నాగ్వర్ గ్రామనికి చెందిన జహీర్ పటేల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.జంగి మాజీ సర్పంచ్ నవీన్ తన చిన్ననాటి మిత్రుడు జహీర్ పటేల్ ని సన్మానించి కేక్ కట్ చేసి ఉడత భక్తిని చాటుకున్నాడు.జహీర్ కులమతలకు,పార్టీలకు అతీతంగా మండలంలో అందరితో పలకరిస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూత అందిస్తు న్నాడు.జహీర్ కు ఆదేవుడు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా చూడాలని అక్షింతలతో ఆశీర్వదించి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జంగి మాజీ సర్పంచ్ నవీన్ ఆధ్వర్యంలో రాయికోడ్ నడిమిదొడ్డి రాజు,నాగ్వర్ అనిల్ ముదిరాజ్ నాగ్వర్ తాజా మాజీ సర్పంచ్ కళావతి పాండుముదిరాజ్,నాగ్వర్ మాచ్కురి కృష్ణ, మైబాత్పూర్ మైజోద్దీన్,షాపురం కృష్ణ ముదిరాజ్ నాగ్వర్ రాగపురం నర్సింలు, మచ్కురి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలోని పోచమ్మ దేవాలయ స్మశానవాటికకు సరైన సౌకర్యాలు కల్పించాలి

## ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్



**బెల్లంపల్లి,జూన్18(సూర్య రేఖ)**బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ గుడి సమీపంలోని స్మశానవాటికలో సరైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,పసులేటి వెంకటేష్లు అన్నారు.ఈ మేరకు బుధవారం బెల్లంపల్లి ఎంసిపిఐయూ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ..బెల్లంపల్లి పోచమ్మ ఆలయం సమీపంలో స్మశానవాటికలో సరైన వసతులు లేక ప్రజలు నాన ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ గుడి దగ్గర స్మశానవాటిక మాత్రం ఎలాంటి సౌకర్యాలకు నోచుకోవడం లేదని అన్నారు.బెల్లంపల్లి నియోజకవర్గంలో నలుగురు ఎమ్మెల్యేలు మారి ఐదవ ఎమ్మెల్యే బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి గెలిచిన కూడా బెల్లంపల్లిలో పోచమ్మ గుడి దగ్గర స్మశానవాటికలో ఎలాంటి సౌకర్యాలు ఏర్పరచకపోవడం అనేది చాలా విడ్డూరంగా ఉందని అన్నారు.రూ.కోటితో కాంపౌండ్ నిర్మించినప్పటికీ స్మశానవాటికకు గేటు లేకపోవడం అనేది కూడా చాలా బాధాకరమని ఇక్కడ ఒక వాచ్ మెన్ కూడా నియమించక పోవడం అనేది చాలా వింతగా విచిత్రంగా ఉందని,బోరు వేసినప్పటికీ బోరును మరమ్మతులు చేయించకుండా అధికారులు నిర్లక్ష్యం వ్యవహారిస్తు న్నారని,ఎవరైనా చనిపోయి స్మశానవాటికకు వస్తే,స్నానం చేద్దామని పక్కనే ఉన్న చెరువులోకి వెళ్లి స్నానం చేస్తే వివిధ చర్మ వ్యాధులు,రోగాల భారీన పడే అవకాశం ఉన్నందున ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు.ఇప్పటికైనా సంబంధిత ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందించి పోచమ్మ గడ్డ దగ్గరలో ఉన్న స్మశానవాటికలో సరైన వసతులు ఏర్పాటు చేసి బెల్లంపల్లి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్,మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందుచేత



**శివంపేట,జూన్18(సూర్యరేఖ)**శివంపేట మండల పిల్లుట్ల గ్రామానికి చెందిన పెద్దపులి కృష్ణ,జయమ్మ దంపతులకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో యాక్సిడెంట్ అయ్యింది.పెద్దపులి కృష్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.60 వేలు,జయమ్మకు రూ.22,500 ల చెక్కులను పిల్లుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవరెడ్డి,బొమ్మిడాలా శంకర్,యువ నాయకులు బుర్ర మురళి గౌడ్ ఆధ్వర్యంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొల్ల నాగయ్య,సంద్ర లక్ష్మయ్య బబ్బురి మల్లేష్,బుర్ర విజయ్ గౌడ్,బుర్ర శ్రీనివాస్ గౌడ్,బబ్బురి శ్రీనివాస్ పిల్లి మధు,గాండ్ల కిష్టయ్య,గుర్రాల బాలేష్,పెద్దపులి సతీష్,గొల్ల స్వామి తలారి హనుమంతు,గులయ్య గారి రవీందర్,పెద్దపులి కుమార్,మస్కూరి కన్నయ్య,సంద్ర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా అందించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బండారి గంగాధర్



**శివంపేట,జూన్18(సూర్య రేఖ)** వానకాలం పంట రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేయడం సంతోషంగా ఉందని మెదక్ జిల్లా ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి గంగాధర్ అన్నారు.రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాలో 4 ఎకరాలలోపు రైతు ఖాతాలో పెట్టుబడి సహాయం ఆర్థిక సహాయాన్ని అందజేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసిన ప్రభుత్వంగా ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎంతో సమన్వయంగా గత ప్రభుత్వంలో చేయలేని విధంగా ఈ ప్రభుత్వంలో ఎంతో మేలు ప్రజలకు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి గంగాధర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## గోల్కొండ బోనాలు ఏర్పాట్లను పర్యవేక్షించిన దేవాదాయ కమీషనర్ వెంకట్ రావు,అధికారులు





**నాంపల్లి,జూన్18(సూర్యరేఖ)** చారిత్రక గోల్కొండ కోట శ్రీజగదాంబిక అమ్మవారి బోనాలు జూన్ 26వ తేదీన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎండోమెంట్ కమీషనర్ వెంకట్ రావు బృందం ఎండోమెంట్ ఈఓసి వసంత,అదనపు సీపీ విక్రమ్‌సింగ్,హైదరాబాద్ అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి,సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్,ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు,ఎస్.బీ డీసీపీ అప్రూవరావు,ఎండోమెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిలజా రామయ్యర్,టోలిచౌకి ఏసీపీ ఫియాజ్,గోల్కొండ బోనాల కమిటి చైర్మన్ చంటిబాబు,కమిటీ సభ్యులు పర్యటించి ఏర్పాట్ల పనులను పరిశీలించారు.

# భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి





**మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం..**
**తల్లి వందనం కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్**

**రాజేంద్రనగర్,జూన్18(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ తరపున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్ర నగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తల్లి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా శివరాంపల్లిలో హనుమాన్ దేవాలయం అరాంఘర్దగ్గర మొక్కలు నాటే కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై.శ్రీధర్ మాట్లాడుతూ...తల్లి వందనం కార్యక్రమంతో మొక్కలు నాటే కార్యక్ర మాన్ని మరింత ఉత్సాహంగా చేయాలన్నారు.ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు.మొక్కను పెంచితే పెరిగి పెద్దవై మనకు ఆక్సిజన్ ఇస్తాయన్నారు.మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారమవుతామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సకల ప్రాణ కోటి జీవించటానికి అవసరమైన గాలి నీరు ఆహారం, మంచి వాతావరణం లభించటానికి చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరు కృషి చేయాలని వై.శ్రీధర్ సూచించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యం కాకుండా అరికట్టవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొక్క బాల్ రెడ్డి,సత్యనారాయణ ముదిరాజ్,హరి కిషన్ జి, సోల్కర్ రెడ్డి ఎన్.జగన్ శ్రీకాంత్ రెడ్డి,కోరని క్రాంతి,బాబురావు,బండారి బాలకృష్ణ,రజిని కాంత్ మల్లేష్ చారి వెంకటేష్ సురేందర్ తిరుమలేష్ రాకేష్ గౌడ్ యాదయ్య కవిత రమాకాంత ,గణేష్,తుంగ ఇంద్ర రెడ్డి,సరిత రెడ్డి రాజశేఖర్రెడ్డి పవన్,శ్రీనివాస్ రెడ్డి,పి వంశీ రాజు నాయక్ నాయకులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ దోపిడి..

హద్దే లేని ప్రైవేటు విద్యాలయాల ఫీజు..
పుస్తకాల పేరిట వేలకు వేలు దోపిడీ..
మెటీరియల్ పేరిట మరో అదనపు ఖర్చు..
బయట పుస్తకాలు కొంటె స్కూల్లోకి అనుమతి.. లేదంటూ హుకుం
వసతులు నీల్,ఫీజులు ఫుల్..
వార్షిక మామూళ్లతో చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు..
బడి బతుకే భారమైందని ఆవేద వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు..
మండలంలో క్రీడా ప్రాంగణాలు లేని పాఠశాలలు కోకొల్లలు..











విద్య వ్యాపారంగా మారి ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిండి చేస్తున్నారు.ప్రస్తుతం సమాజంలో తల్లిదండ్రులకు తమ పిల్లల విద్య కోసం నానా అగచాట్లు పడుతున్నారు.స్థాయికి మించి కడుపు కాల్చుకొని మరి ఉన్నత విద్య కోసం వెంపర్లాడుతూ కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల మాయలో చిక్కుకొని జేబులు లూటీ చేసుకుంటున్నారు.ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేక,కార్పొరేట్ స్కూళ్ల ఆకర్షణలో పడిన తల్లిదండ్రులు పుస్తకాల పేరిట దోపిడీ,వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యను లాభాల వ్యాపారంగా మలుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు..

**మేడ్చల్,జూన్ 18(సూర్యరేఖ)** ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులకు తమ పిల్లల విద్య కోసం నానా అగచాట్లు పడుతున్నారు.స్థాయికి మించి కడుపు కాల్చుకొని మరి ఉన్నత విద్య కోసం వెంపర్లాడుతూ కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల మాయలో చిక్కుకొని జేబులు లూటీ చేసుకుంటున్నారు.ప్రభుత్వ పాఠశాలల విద్య తీరుపై నమ్మకం లేదో లేక ప్రైవేటు పాఠశాలల ఆకర్షణకు గురయ్యారో తెలియదు కానీ మండలంలో 80 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థలలకే పరిమితమవుతున్నారు. జూన్ 12 విద్యావ్యవస్థ ప్రారంభంకాక ముందే పుస్తకాలు కొనాలంటూ లేదంటే అయిపోతాయంటూ బెదిరింపు ధోరణిలు చేస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు తల్లిదండ్రుల వద్ద పుస్తకాల పేరుతో దోపిడీ చేశారు.నర్సరీ చదివే విద్యార్థికి రూ.5 వేలకు మించి నగదు ఖర్చు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.ప్రతి తరగతి పెంచుకుపోతూ మెటీరియల్ పేరిట అదనపు పుస్తకాలు అంటూ వేలకు వేలు దోచేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నియమావళి ప్రకారం సిలబస్ పుస్తకాలను అన్ని తరగతులకు ఒకటే అయినా ప్రభుత్వం ఇచ్చిన పుస్తకాలు ఇవ్వకుండా మెటీరియల్ పేరిట కార్పోరేట్ స్కూళ్లు కొత్త దందాకు తెరతీశాయి.ఈ పుస్తకాలు బయట మార్కెట్లో ఉండవు కాబట్టి అక్కడే కొనాలని షరతులు విధిస్తూ తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేశారు.ఒక పాఠశాలలో పుస్తకాలు అమ్మాలంటే ప్రభుత్వం నిబంధనలు తప్పనిసరి అయితే అవి ఏమీ పట్టించుకోకుండా నిబంధనలకు తూట్లు పొడుస్తూ రూ.2 వేలు కూడా విలువ చేయని పుస్తకాలను సుమారు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**-ఫీజు నిబంధన సరే సరి..**

ప్రైవేటు విద్యాలయాల పుస్తకాల రేటు ఆ తరహాలో ఉంటే విద్యార్థి వార్షిక సంవత్సర ఫీజు ఆకాశమే హద్దుగా మారింది.సాధారణ ప్రైవేటు పాఠశాలల్లో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తుంటే సెంట్రల్ స్కూల్ అంటూ కార్పొరేట్ స్కూల్ అంటూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ తీరుపై పూర్తిగా విస్మరిచ్చిందని తల్లిదండ్రులు విమర్శకులు ఎప్పుడూ తెలుపుతూనే ఉన్నా ప్రతి ఒక్క సంవత్సరం ప్రైవేటు విద్యా వ్యవస్థ తల్లిదండ్రుల వద్ద భారీగా దోపిడీ చేస్తుంది.ఏ ఒక్క పాఠశాలలోనూ,కార్పొరేట్ స్కూళ్లలోనూ ఫీజు పట్టిక ఎప్పుడు ఏర్పాటు చేయరు.కనీసం స్కూల్ ల పేరుతో అధికార ఫీజు రుసుము కూడా ఇవ్వరు. ఒలంపియాడ్ టెక్నో,ఐఐటి జేఈ ఇలా రకరకాల పేర్లతో విద్యార్థులకు భవిష్యత్తు అందిస్తామని అధికంగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా విద్యావ్యవస్థనే రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపార సముదాయంగా మార్చేశారు. మేడ్చల్ మండలంలో అనేక ప్రైవేటు పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లు ఏర్పడ్డాయి అంటే విద్య వ్యాపారంగా మారిపోయిందని తేటతెల్లమైంది. ఇక వసతుల విషయానికి వస్తే పాఠశాలల్లో నిబంధనల ప్రకారం ఏ వస్తువులు లేకపోగా అన్నీ ఉన్నాయంటూ రంగు బ్రోచర్లలో దర్శనమిస్తాయి. కానీ అరకొర వసతులతోనే విద్యాలయాలను నడిపిస్తున్నారు.

**-చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు..!**

మేడ్చల్ మండలంలోని ప్రైవేటు స్కూళ్ల పేరిట దోపిడీ చేస్తున్న నామ మాత్రపు చర్యలు కూడా విద్యాశాఖ అధికారులు పట్టించుకోరు.కుర్చీలకే పరిమితమై వార్షిక మామూళ్లతో మిన్నకుంటున్నారన్న వార్తలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి.ప్రతి సంవత్సరం జూన్ మాసంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేసిన నగదులో ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ముడుపులు అందిస్తున్నారన్న వార్తలు కూడా జోరందుకున్నాయి.ఈ పుకార్లు నిజమయ్యే విధంగా విద్యాశాఖ అధికారుల తీరు కూడా విస్మయానికి గురిచేస్తుంది.ఏ ఒక్క కార్పొరేట్ స్కూల్ లను కానీ ప్రైవేటు స్కూళ్లని కానీ తనిఖీలు చేయకపోగా ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వైపే మొగ్గుచూపుతూ వివరణలు అందించడం ఈ శాఖకు పరిపాటిగా మారింది. మేడ్చల్ మండలంలో ప్రైవేటు పాఠశాలలు పర్మిషన్ తీసుకొని కేంద్రీయ విద్యాలయంగా సెంట్రల్ స్కూల్ ల పేరుతో నడుపుతున్న బడా బాబుల విద్యాలయాలపై కన్నెత్తి కూడా చూడటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యాశాఖపై, విద్యాశాఖ అధికారుల తీరుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు

## రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**రామాయంపేట,జూన్18(సూర్య రేఖ)** రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ రజనీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా రజనీకుమారి మాట్లాడుతూ..కాట్రియాల గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం 137 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు,అందుకు ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు.నేడు రాయాలపూర్ లో జరగబోయే రెవెన్యూ సదస్సును ప్రజలు విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐ గౌస్ మొయినోద్దీన్,రూరల్ ఆర్ఐ గోపి రెవెన్యూ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మారంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు..



**రామాయంపేట,జూన్18(సూర్య రేఖ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో బుధవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇండ్లు మంజూరైన 32 మంది లబ్ధిదారుల్లో సుతారి రాజలక్ష్మి,కామరాం నర్సవ్వ ఉడుత సుజాత,కట్ట మార్తవ్వ నలుగురికి భూమి పూజ చేసి ముగ్గు పోశారు.ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,స్థానిక మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు,గ్రామ సెక్రటరీ మహేందర్ స్థానిక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మండల అధ్యక్షులు పెటేరి నాగరాజు,సోషల్ మీడియా నాయకులు ముస్కుల సుధాకర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి దొమ్మాట రవీందర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మసాయిపేట మల్లేశం,ఉపాధ్యక్షులు బండారి మహేందర్ గౌడ్,ఉడుత రాజేశం,చాకలి చిన్న నారాయణ,వడ్ల శ్రీశైలం వడ్ల రవీందర్,గ్రామ యువజన అధ్యక్షులు కమ్మరి కిరణ్ చారి,కట్ట మహేందర్,జక్కుల సుధాకర్,నక్కని బాబు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని యువకుడు మృతి



**రామాయంపేట,జూన్18(సూర్య రేఖ)** బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన రామాయంపేటలో చోటుచేసుకుంది.వివరాల ప్రకారం..రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తీకి చెందిన దేవుని రాజేందర్ (27) వృత్తి రీత్యా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.గత మంగళవారం రాత్రి సుమారు 10 గంటలకు ఆమె కుమారుడు రాజేందర్ తను తన మోటార్ సైకిల్ నంబర్ (టీఎస్08డీపీటీఆర్6512) గల బైక్ పై తన అత్త గ్రామం సూతార్ పల్లి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో రామాయంపేట తండా దాటిన తరువాత మూల మలుపు వద్ద అకస్మాత్తుగా అడవి పంది అడ్డు రావటం వలన దానిని తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొని ఆమె కొడుకు రోడ్డు కిందకు పడిపోగా తలకు బలమైన రక్త గాయాలు అయ్యాయి.దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు.తదుపరి మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ తరలించామని దరఖాస్తు రాగ మృతుని తల్లి దేవుని విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై బాలరాజ్ తెలిపారు.

# కన్నప్పతో ఎంట్రీ... జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకం!




మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న చిత్రం కన్నప్ప. ఈ సినిమాకు ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న కన్నప్ప జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. ఆడియన్స్‌లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. తాజాగా మంచు విష్ణు తన కుమారుడి వీడియోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. తన కుమారుడు అవ్రామ్ కన్నప్ప మూవీతో అరంగేట్రం చేయడం సంతోషంగా ఉందంటూ మంచు విష్ణు సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. తను సెట్‌లోకి రావడం, మాటలు చెప్పడం, ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నటించడం నా జీవితంలో అత్యంత భావోద్వేగ క్షణాల్లో ఒకటని తెలిపారు. ఒక తండ్రిగా నేను ఒకప్పుడు కలలు కన్న అదే ఆకాశం కింద మన బిడ్డ ప్రకాశించడం చూస్తే అంతకు మించింది ఏదీ ఉండదు..ఇది కేవలం అరంగేట్రం కాదు. ఇది జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకమని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మీరు ఎల్లప్పుడూ నాకు ఇచ్చిన అదే ప్రేమ, ఆశీర్వాదాలతో మీరందరూ నా కుమారుడిపై కూడా చూపిస్తారని నేను ఆశిస్తున్నా.. అవ్రమ్ ప్రయాణం ప్రారంభం.. అది కన్నప్పతో మొదలు కావడం చాలా సంతోషంగా ఉందంటూ మంచు విష్ణు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా.. కన్నప్పలో రెబల్ స్టార్ ప్రభాస్ కూడా నటించారు. ట్వంటీ ఫోర్ ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మించారు. ఈ సినిమాలో మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి అగ్రతారలు నటించారు. వీరితో పాటు అర్పిత్ రాంకా, బ్రహ్మానందం, సప్తగిరి, ముఖేష్ రిషి, మధుబాల, ఐశ్వర్య భాస్కరన్, బ్రహ్మాజీ, దేవరాజ్, రఘు బాబు, శివ బాలాజీ కీలక పాత్రల్లో మెప్పించారు. కాగా.. ఈ సినిమాను ఇటీవలే సూపర్ స్టార్ రజినీకాంత్ వీక్షించారు. అద్భుతంగా ఉందంటూ కొనియాడారు.




# 'హరిహర వీరమల్లు'కి పోటిగా వస్తున్న విజయ్ 'కింగ్‌డమ్'.!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం కింగ్‌డమ్. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. గత నెల మే 30న విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రం పలు కారణాల వలన వాయిదా పడుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తుదంటూ పోస్ట్ పోన్ చేసుకున్నారు మేకర్స్ కానీ.. ఈ తేదీకి వీరమల్లు కూడా రాకపోవడంతో తేదీ వృధాగా పోయింది. ఆ తర్వాత ఇండియా పాకిస్థాన్ మధ్య పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో ఈ సినిమాను జూలై 04న తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఈ తేదీ కూడా క్యాన్సిల్ అవ్వడంతో తాజాగా మరో డేట్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఈ సినిమాను జూలై 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే కింగ్‌డమ్ వచ్చే కంటే ఒకరోజే ముందే వీరమల్లు రాబోతుంది. హరిహర వీరమల్లుని జూలై 24న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రెండు సినిమాలకు గట్టి పోటి ఉండబోతుందని సమాచారం. కింగ్‌డమ్ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కేరళ, శ్రీలంకలో చిత్రీకరించినట్లు సమాచారం.

# కీరవాణి నుంచి భీమ్స్ చేతికి విశ్వంభర?




తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో విశ్వంభర ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌కి సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాకు సంబంధించి షూటింగ్ పరంగా ప్రస్తుతం స్పెషల్ సాంగ్ ఒక్కటే బ్యాలన్స్ ఉందని సమాచారం. అయితే ఈ సాంగ్ ఇంకా ఒకే కాలేదని.. కీరవాణి సంగీతం అందించిన సాంగ్ చిరుకి నచ్చలేదని.. అందుకే.. కొత్త సంగీత దర్శకుడు భీమ్స్‌తో చిత్రయూనిట్ సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి చిత్రబృందం అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.



# వెండిమబ్బులలో అందాల జాబిలమ్మ

తెలుగు సినీరంగంలో హిట్స్ అందుకున్నప్పటికీ అవకాశాలు అందుకోని హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్. ఈ అమ్మడు నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయ్యాయి. కానీ ఇప్పటికీ ఈ బ్యూటీకి సరైన ఆఫర్స్ రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంది. తెలుగులో తొలి చిత్రంతోనే నటిగా ప్రశంసలు అందుకుంది ప్రగ్యా జైస్వాల్. అందం, అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసిన ప్రగ్యా.. ఇప్పటివరకు సరైన బ్రేక్ అందుకోలేదు. అంతేకాదు.. స్టార్ హీరోల సరసన నటించినప్పటికీ ఈ బ్యూటీకి అంతగా క్రేజ్ రాలేదు. తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో యంగ్ హీరోలతోపాటు పలువురు స్టార్స్ సరసన నటించిన ప్రగ్యా.. ఇప్పుడు ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. తాజాగా ఆమె ఉత్తమ నటిగా గద్దర్ అవార్డ్ అందుకుంది. వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన కంచె సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో అద్భుతమైన నటనతో కట్టిపడేసింది. కంచె సినిమాలో తన నటనకుగానూ ఉత్తమ నటిగా గద్దర్ అవార్డ్ అందుకుంది. అలాగే బాలకృష్ణ నటించిన అఖండ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో తన నటనకు ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు వస్తాయి అనుకున్నారు. కానీ ఆ అదృష్టం ఆమెకు కలిసిరాలేదు. ఈ సినిమా తర్వాత ప్రగ్యాకు అంతగా ఆఫర్స్ అంతగా రాలేదు. ప్రస్తుతం బాలయ్య నటిస్తోన్న అఖండ సీక్వెల్ అఖండ 2లో నటిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఆమె సిల్వర్ చీరలో అందమైన జాబిలమ్మగా మెరిసిపోతుంది. వెండిమబ్బులలో మెరిసిన వెన్నెలమ్మగా కనిపిస్తుంది. ప్రగ్యా జైస్వాల్.. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ లో జన్మించింది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్లో చదివింది. సింబయాసిస్ యూనివర్సిటీలో చదువుతున్న రోజుల్లోనే అందాల పోటీలలో పాల్గొంది. మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ప్రగ్యా జైస్వాల్ ఫెమినా మిస్ ఇండ్షియ 2008లో పోటీల్లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్ టైటిల్ గెలుచుకుంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,